# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 311, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం - 23 - జనవరి - 2025


# మెగా పెట్టుబడులు


## మేఘా ఇంజినీరింగ్ కంపెనీ,రాష్ట్ర ప్రభుత్వం మధ్య మూడు కీలక ఒప్పందాలు

- రూ.15వేల కోట్ల పెట్టుబడులు మెగావాట్ల
- పంప్డ్ స్టోరేజ్ కోసం రూ.11 వేల కోట్లు పెట్టుబడులు బ్యాటరీ
- ఎనర్జీ స్టోరేజ్ కోసం రూ.3 వేల కోట్లు అనంతగిరిలో
- ప్రపంచస్థాయి లగ్జరీ వెల్నెస్ రిస్టార్ట్ ఏర్పాటు కోసం రూ.వెయ్యి కోట్లు



హైదరాబాద్: మేఘా ఇంజినీరింగ్ (ఎంఇఐఎల్) కంపెనీ తెలంగాణ ప్రభుత్వంతో మూడు కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో 2,160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్ ఏర్పాటుకు పరస్పర అవగాహన ఒప్పం దం (ఎంఒయు)పై సంతకాలు చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు లో మిగతా..2లో

## 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకానికి పదేళ్లు పూర్తి...



2లో

న్యూఢిల్లీ, : ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'నేటితో బేటీ బచావో, బేటీ పఢావో ఉద్యమానికి పదేళ్లు పూర్తవుతాయి. గత దశాబ్ద కాలంలో ఇది ఒక కీలక పరివర్తన, ప్రజల-ఆధారిత చొరవగా మారింది. అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని' ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. లింగ అడ్డంకులు, పక్షపాతాలను అధిగమించడంపై ఈ ఉద్యమం దృష్టి సారించిందని, ఆడపిల్లలకు విద్య, అవకాశాలు ఉండేలా చూసేందుకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసం ప్రజలతోపాటు వివిధ కమ్యూనిటీ సంస్థలు చేపట్టిన ప్రయత్నాలకు, అంకిత భావానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.ప్రస్తుతం పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు గణనీయమైన మెరుగుదలను సాధించాయని, మిగతా..2లో


## వేద విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటాం : చంద్రబాబు



2

అమరావతి : కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. హంపీకి వెళ్తూ పొరుగు రాష్ట్రంలో ప్రమాదానికి గురైన వారికి అవసరమైన వైద్య సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వేద విద్యార్థుల అకాల మరణంతో తీవ్ర శోకంలో ఉన్న వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వేద విద్యార్థులతో పాటు డ్రైవర్ కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని ట్విటర్‌లో పేర్కొన్నారు. కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మిగతా..2లో

## కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ... వి.ప్రకాశ్‌ను ప్రశ్నించిన కమిషన్



2

- కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- 101వ సాక్షిగా ప్రకాశ్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన కమిషన్
- తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరంకు సైట్ మార్పుపై కమిషన్ ప్రశ్నించిందన్న ప్రకాశ్

## హైటెక్ సిటీలోని కొత్త క్యాంపస్‌ను ప్రారంభించాలని రేవంత్ రెడ్డిని కోరిన హెచ్‌సీఎల్ టెక్ సీఈవో



- దావోస్‌లో రేవంత్ రెడ్డితో హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో భేటీ
- హైటెక్ సిటీలో కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తోన్న హెచ్‌సీఎల్ టెక్
- ఫిబ్రవరిలో దీనిని ప్రారంభించాలని సీఎంను కోరిన గ్లోబల్ సీఈవో

# ఏఐ హబ్ గా ఏపీ : ప్రపంచ వేదికపై మంత్రి లోకేష్

- దావోస్ కుర్ పార్కు విలేజ్ లో జరిగిన ఈ సమావేశంలో మంత్రి లోకేష్
- 2047 నాటికి 95% నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయాలనే లక్ష్యం
- తాజా అధ్యయనాల ప్రకారం వెయ్యికి పైగా ఉద్యోగులున్న 42% సంస్థలు తమ రోజువారీ కార్యకలాపాల్లో కృత్రిమ మేధస్సు ను ఉపయోగిస్తున్నా
- ఏఐ వినియోగంలో భారతదేశం (59%), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (58%), సింగపూర్ (53%) అగ్రస్థానంలో ఉన్నా
- మానవ వనరులను తయారు చేయడం, కార్పొరేట్ అవసరాలను తీర్చడంపై దృష్టి సారిస్తున్నా
- నిరంతర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టాలెంట్ హబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది

**భారత ప్రభుత్వం 'స్వయం' పేరుతో ప్రపంచంలోనే అతిపెద్ద మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులను నిర్వహిస్తోంది**



2లో

అమరావతి : ప్రపంచ ఆర్థిక వేదిక విద్యారంగ గవర్నర్ల సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కీలక ప్రసంగం చేశారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా విధానంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు... రేవంత్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు



2

- రేషన్ కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలన్న హరీశ్
- రేవంత్ కు దమ్ముంటే గ్రామసభలకు రావాలని సవాల్
- చెప్పిన విధంగానే చంద్రబాబు పెన్షన్ పెంచారని వ్యాఖ్య

హైదరాబాద్ : రేషన్ కార్డుల కోసం ఏడాది క్రితం దరఖాస్తు ఇస్తే ఇంతవరకు దిక్కు లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు.

## అంతరిక్షం నుంచి మహాకుంభ మేళా.. ఫొటోలు విడుదల చేసిన ఇస్రో



2

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. 45 రోజులపాటు సాగే ఈ మహాకుంభ మేళాలో భాగంగా త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం యూపీ సర్కార్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం ప్రత్యేక టెంట్లు వంటి నిర్మాణాలు చేపట్టింది. దీంతో మహాకుంభ్ మొత్తం మిగతా..2లో

## ట్రంప్ నిర్ణయంతో అప్రమత్తమైన భారత్.. వారిని వెనక్కి రప్పించే యోచనలో కేంద్రం..!



2

న్యూఢిల్లీ : అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్‌లో నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన అక్రమ వలసదారులపై కఠిన వైఖరిని అవలంభిస్తున్నారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అధిక పన్ను విధిస్తున్నారు. తద్వారా వలసలను తగ్గించొచ్చని అధ్యక్షుడు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యలతో భారత్ ఆచుతూచి నిర్ణయాలు తీసుకుంటోంది.

## డిప్యూటీ సీఎం పదవిపై నారా లోకేశ్ తొలి స్పందన!



2

- లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ టీడీపీలో డిమాండ్లు
- మంత్రిగా తనకు చేతినిండా పని ఉందన్న లోకేశ్
- చంద్రబాబు పెట్టిన టార్గెట్లపై ఫోకస్ చేశానని వెల్లడి

## ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు పవన్ కళ్యాణ్ తీపికబురు..

### ఆ శాఖలో ఉద్యోగుల ప్రమోషన్లకు గ్రీన్ సిగ్నల్

- కీలక ఆదేశాలు, ఆ రూల్ కూడా మార్చారు
- ఏపీ పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగుల ప్రమోషన్లు
- కీలక ఆదేశాలు జారీ చేసిన డిప్యూటీ సీఎం పవన్
- ఉద్యోగ సంఘాల నేతలతో కీలకమైన సమావేశం
- డీపీసికి సంబంధించి కూడా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు.



అమరావతి : : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ శాఖలో ఉద్యోగుల ప్రమోషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ ప్రక్రియను ప్రారంభించే పనిలో ఉన్నారు.

## ఏడు పాయింట్లతో ఆప్, మేనిఫెస్టో.. బీజేపీని ఇరుకునపెట్టేలా కీలక డిమాండ్లు



2లో

ఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు త్రిముఖ పోటీ నెలకొంటోంది. అధికార ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంటోంది. పేద, మధ్య తరగతి ప్రజలను తమ వైపునకు తిప్పుకునేలా ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల హామీలను గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రిలీజ్ చేశారు. మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకునే మిగతా..2లో

## వేద విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటాం : చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

కర్నూలు జిల్లా వాసుల మృతి పట్ల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్ణాటక జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బుధవారం వేకువ జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏపీకి చెందిన విద్యార్థులతో పాటు నలుగురు దుర్మరణం చెందారు. మృతులను మంత్రాలయం వేదపాఠశాలకు చెందిన వారిగా గుర్తించారు. విద్యార్థులు వాహనంలో కర్ణాటక హంపీ క్షేత్రంలోని నరహరి తీర్థుల ఆరాధన కోసం తుఫాను వాహనంలో బయలుదేరి వెళ్లారు. మంత్రాలయం నుంచి మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లగా.. ఉత్తరకన్న జిల్లాలో సింధనూరు వద్ద ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో 14 మంది విద్యార్థులు ఉన్నారు. ఘటనలో వాహనం డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో డ్రైవర్ శివ, విద్యార్థులు అభిలాష, హైవదన, సుజేంద్ర, ఉన్నారు.

## హైటెక్ సిటీలోని కొత్త క్యాంపస్‌ను ప్రారంభించాలని రేవంత్ రెడ్డిని కోరిన హెచ్‌సీఎల్ టెక్ సీఈవో

న్యూఢిల్లీ : హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్మిస్తోన్న తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ విజయ్ కుమార్ కోరారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎంతో ఆయన భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు పాల్గొన్నారు. హైటెక్ సిటీలో 3.2 లక్షల చదరపు అడుగుల్లో హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్‌ను నిర్వహిస్తోంది. ఈ కొత్త క్యాంపస్ నిర్మాణంతో 5 వేల మంది ఐటీ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ క్రమంలో ఫిబ్రవరిలో దీనిని ప్రారంభించాలని సీఎంను వారు కోరారు. తెలంగాణలో హెచ్‌సీఎల్ టెక్ సంస్థ తన సేవలను విస్తరించడాన్ని సీఎం స్వాగతించారు.

తెలంగాణలో 'కంట్రోల్ ఎస్' భారీ పెట్టుబడి

హైదరాబాద్‌లో రూ.10 వేల కోట్ల భారీ పెట్టుబడికి 'కంట్రోల్ ఎస్' ముందుకు వచ్చింది. 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదిరింది. దీంతో తెలంగాణలో 3,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది. మంత్రి శ్రీధర్ బాబు, 'కంట్రోల్ ఎస్' సీఈవో శ్రీధర్ సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ డేటా సెంటర్ రాష్ట్రంలో మరో మైలురాయి కానుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ... వి.ప్రకాశ్‌ను ప్రశ్నించిన కమిషన్

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ హాజరయ్యారు. కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై కమిషన్ ఆయనను ప్రశ్నించింది. విచారణ అనంతరం వి.ప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో 101వ సాక్షిగా తన స్టేట్‌మెంట్‌ను కమిషన్ రికార్డ్ చేసుకుందన్నారు. తన వద్ద సమాచారం ఉందని గతంలో తానూ కమిషన్‌కు ఓ స్టేట్‌మెంట్, ఓ నోట్ సమర్పించానన్నారు. వాటి ఆధారంగా కమిషన్ తనను క్రాస్ ఎగ్జామిన్ చేసిందన్నారు. వీటిలో కొన్ని అంశాలపై తన వివరణ తీసుకున్నారని తెలిపారు. తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరంకు సైట్‌ను ఎందుకు మార్చవలసి వచ్చింది? దానిని సమర్థిస్తున్నారా? అంటూ పలు ప్రశ్నలు వేసినట్లు చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని, బ్యారేజీ ఎత్తును తగ్గించాలని మహారాష్ట్ర అభ్యంతరం తెలిపిందని వెల్లడించారు. అందుకే మార్చినట్లు చెప్పారు. మేడిగడ్డ వద్ద ఆనకట్ట వద్దని ఇంజినీర్ల కమిటీ చెప్పింది కదా? అని కమిషన్ ప్రశ్నించిందని, కానీ రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ అలా చెప్పలేదని ఆయన తెలిపారు. బొగ్గు గనుల వద్ద సొరంగాలు వద్దన్న సిఫార్సులను నాటి ప్రభుత్వం గౌరవించినట్లు చెప్పారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని కాళేశ్వరంను నిర్మించినట్లు చెప్పారు. తాము రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా పనిచేస్తామన్నారు.

## చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు... రేవంత్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు

మొదటి పేజి తరువాయి


దరఖాస్తుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. రేషన్ కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించారు. ఏపీలో గెలిచిన వెంటనే పెన్షన్ పెంచుతానని చెప్పిన చంద్రబాబు... చెప్పిన విధంగానే పెన్షన్ ను పెంచారని కితాబిచ్చారు. రేవంత్ మాత్రం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. అందరికీ పరమాన్నం పెడతామని ఎన్నికల సమయంలో చెప్పారని... ఇప్పుడు పంగనామాలు పెడుతున్నారని దుయ్యబట్టారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... అదే పరంపర కొనసాగిస్తోందని చెప్పారు. సిద్ధిపేట పట్టణంలోని చెర్లపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన సభలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రైతులకు రుణమాఫీ అయిందని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో చెబుతున్నారని... "దమ్ముంటే ఇక్కడకు రా చూపెడతా"అని సవాల్ విసిరారు. రుణమాఫీ సగం కూడా చేయలేదని మండిపడ్డారు. పాక్షికంగా రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. పోలీసులను పెట్టి గ్రామసభలు నిర్వహిస్తున్నారని అన్నారు. రేవంత్ కు దమ్ముంటే గ్రామసభలకు రావాలని ఛాలెంజ్ చేశారు. రైతుబంధు ఎప్పుడు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామసభల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని హరీశ్ విమర్శించారు. ఏడాదిలోనే రేవంత్ వ్యతిరేకతను మూటకట్టుకున్నారని అన్నారు.

## డిప్యూటీ సీఎం పదవిపై నారా లోకేశ్ తొలి స్పందన!

అమరావతి : మంత్రి నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. లోకేశ్ ను ఉప ముఖ్యమంత్రి చేయాలంటూ వరుసబెట్టి టీడీపీ నేతలు డిమాండ్ చేయడంతో... ఈ అంశం జనసేనలో ప్రకంపనలు పుట్టించింది. ఈ అంశం వివాదాస్పదం కావడంతో టీడీపీ అధిష్ఠానం కన్నెర్ర చేసింది. ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ కేడర్ కు ఆదేశాలు జారీ చేసింది. జనసేన కూడా తమ పార్టీ నేతలు, కార్యకర్తలెవరూ ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడొద్దని, సోషల్ మీడియాలో స్పందించవద్దని ఆదేశించింది. పార్టీ ఆదేశాలను ఉల్లంఘించినా, పార్టీ లైన్ దాటినా చర్యలు తప్పవని హెచ్చరించింది.మరోవైపు దావుస్ పర్యటనలో నారా లోకేశ్ బిజీబిజీగా ఉన్నారు. ఈ తరుణంలో లోకేశ్ ను ఓ జాతీయ మీడియా ఛానల్ పలకరించింది. లోకేశ్ డిప్యూటీ సీఎం అనే వార్తలు లోకల్ మీడియాలో వస్తున్నాయని... మీ రాజకీయ లక్ష్యం ఏమిటని ఆ ఛానల్ ప్రతినిధి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా... తాను రాజకీయంగా మంచి పొజిషన్ లో ఉన్నానని లోకేశ్ చెప్పారు.ఎన్నికల్లో తమను ప్రజలు మంచి మెజర్టీతో గెలిపించారని... 94 శాతం సీట్లలో కూటమి అభ్యర్థులు గెలిచారని లోకేశ్ అన్నారు. ప్రస్తుతం తనకు చేతినిండా పని ఉందని... తనకు అప్పగించిన శాఖలపై పూర్తి స్థాయిలో పని చేస్తున్నానని చెప్పారు. సీఎం చంద్రబాబు పెట్టిన టార్గెట్ లపై ఫోకస్ చేశానని తెలిపారు. గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థ దారుణంగా తయారయిందని... విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏపీని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారు చేయాలనే చంద్రబాబు విజన్ కోసం తామందరం పని చేస్తున్నామని తెలిపారు.

## 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకానికి పదేళ్లు పూర్తి...

మొదటి పేజి తరువాయి



అవగాహన ప్రచారాలు లింగ సమానత్వం, ప్రాముఖ్యతను తెలియ జేయడంలో హితో దికంగా తోడ్పడ్డా యన్నారు. దేశంలోని మహిళల హక్కులను కాపాడేందుకు, వారి విద్యకు భరోసా కల్పించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ఈ ఉద్యమాన్ని కింది స్థాయి నుంచి ఉధృతం చేసిన భాగస్వాములందరినీ అభినందిస్తున్నానన్నారు. మన కుమార్తెల హక్కులను పరిరక్షించడాన్ని కొనసాగిద్దాం, వారి విద్యను నిర్ధారిద్దాం. కలిసికట్టుగా వారి కోసం ఎటువంటి వివక్ష లేకుండా అభివృద్ధి చెందగల సమాజాన్ని సృష్టిద్దాం. రాబోయే రోజుల్లో మన దేశ కుమార్తెలకు గొప్ప పురోగతిని, అవకాశాలను వస్తాయ్' అని మోదీ అన్నారు. కాగా ప్రధాని మోదీ 2015 జనవరి 22న హర్యానాలోని పానిపట్‌లో ప్రారంభించిన బేటీ బచావో బేటీ పఢావో పథకం అమలులోకి వచ్చింది. క్షీణిస్తున్న పిల్లల లింగ నిష్పత్తి , లింగ-పక్షపాతం, ఆడపిల్లల మనుగడ, రక్షణ, విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన అత్యంత ప్రభావవంతమైన సామాజిక కార్యక్రమాలలో ఒకటిగా పేరుగాంచింది. లింగ సమానత్వం, సాధికారత వైపు నిరంతర పురోగతిని సాధించడమే...

# ఏఐ హబ్ గా ఏపీ: ప్రపంచ వేదికపై మంత్రి లోకేష్

మొదటి పేజి తరువాయి




పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా పాఠ్యాంశాలు ఉండాలని, విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు పరస్పర సహకారంతో పనిచేయాలని మంత్రి లోకేష్ నొక్కి చెప్పారు. దావోస్ ) కుర్ పార్కు విలేజ్ లో జరిగిన ఈ సమావేశంలో మంత్రి లోకేష్ తో పాటు గ్లోబిస్ యూనివర్సిటీ ఫౌండర్ యోషితో హెూరి, మాంటెర్రీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రెసిడెంట్ డేవిడ్ గార్జా, పియర్సన్ సిఇఓ ఒమర్ అబోష్, యూనవర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రెసిడెంట్ మిచెల్ స్పెన్స్, నెట్ వర్క్ ఫర్ టీచింగ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ప్రెసిడెంట్ జీన్ డానియేల్ లారోక్, కార్నర్ స్టోన్ ఆన్ డిమాండ్ సిఇఓ హిమాన్షు పల్సులే, ఈటిఎస్ సిఇఓ అమిక్ సేవక్, ర్వాండా విద్యాశాఖ మంత్రి జోసెఫ్ సెంగిమన, యుఎఇ విద్యాశాఖ మంత్రి సారా అల్ అమిరి తదితరులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికతలో వస్తున్న మార్పుల కారణంగా విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, తాజా అధ్యయనాల ప్రకారం వెయ్యికి పైగా ఉద్యోగులున్న 42% సంస్థలు తమ రోజువారీ కార్యకలాపాల్లో కృత్రిమ మేధస్సు ను ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ఏఐ వినియోగంలో భారతదేశం (59%), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (58%), సింగపూర్ (53%) అగ్రస్థానంలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఏఐ ప్రాముఖ్యతను గుర్తించిన యునెస్కో, విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఏఐకాంపిటెన్సీ ఫ్రేమ్‌వర్క్‌లను ప్రవేశపెట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఏఐ తో సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం విద్యార్థులకు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. భారత ప్రభుత్వం 'స్వయం' పేరుతో ప్రపంచంలోనే అతిపెద్ద మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులను నిర్వహిస్తోందని, దీని ద్వారా వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాలు కలిగిన విద్యార్థులకు ఉచిత విద్య అందుబాటులో ఉందని మంత్రి లోకేష్ తెలిపారు. 'మేక్ ఏఐ ఫర్ ఇండియా' వంటి కార్యక్రమాలు ఏఐ లో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం, కార్పొరేట్ అవసరాలను తీర్చడంపై దృష్టి సారిస్తున్నాయని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ శిక్షణను ప్రోత్సహించడానికి, శిక్షణ పొందిన ఏఐ నిపుణులను తయారు చేయడానికి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మూడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.255 కోట్లు కేటాయించిందని మంత్రి లోకేష్ వెల్లడించారు. 2047 నాటికి 95% నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయాలనే లక్ష్యంతో STEM, AI విద్యపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన అన్నారు. ఏఐ మద్రాస్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ తన విద్యార్థులను ఏఐ ఆధారిత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడేలా సిద్ధం చేస్తోందని మంత్రి లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడానికి, నిరంతర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టాలెంట్ హబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, డీప్ టెక్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## అంతరిక్షం నుంచి మహాకుంభ మేళా.. ఫొటోలు విడుదల చేసిన ఇస్రో

మొదటి పేజి తరువాయి

ఓ పెద్ద నగరాన్ని తలపిస్తోంది. ఇందుకు సంబంధించి కొన్ని చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ తాజాగా విడుదల చేసింది. స్పేస్ సెంటర్ నుంచి కుంభమేళా ఏరియాను ఉపగ్రహాలు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. మహాకుంభ మేళాకు సంబంధించిన ఏర్పాట్లు చేయకముందు, చేసిన తర్వాత తీసిన ఫొటోలను షేర్ చేసింది ఇస్రో. ఆ ఫొటోల్లో గతేడాది ఏప్రిల్‌లో మహాకుంభ్ ప్రాంతం మొత్తం నిర్మానుష్యంగా కనిపించింది. ఇక డిసెంబర్ 22 నాటికి నిర్మాణాలు వెలిశాయి. ఈ నెల 10న తీసిన ఫొటోల్లో ఓ పెద్ద నగరాన్ని తలపించేలా మహాకుంభ్ ప్రాంతం దర్శనమిచ్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు. హెల్త్‌కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేశారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక కుంభమేళా ప్రాంతంలో 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. మతపరమైన అకాడాలకు కూడా ప్రత్యేక టెంట్లను కేటాయించారు.

## ట్రంప్ నిర్ణయంతో అప్రమత్తమైన భారత్.. వారిని వెనక్కి రప్పించే యోచనలో కేంద్రం..!

మొదటి పేజి తరువాయి



అగ్రరాజ్యంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తోన్న దౌత్య, ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించింది. వాటిపై ఎలాంటి దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడుతోంది. ట్రంప్ పాలనకు సహకరించేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న తమ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత్ యోచిస్తున్నట్లు సమాచారం. సరైన పత్రాలు లేకుండా దాదాపు 18,000 మంది భారతీయులు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. అయితే, వాస్తవానికి ఆ సంఖ్య మరింత ఎక్కువ కూడా ఉండొచ్చని అంచనా. తాజాగా కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వాళ్లందరినీ వెనక్కి పిలిపించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. దీనికోసం ఓ సమగ్ర ప్రణాళికను రూపొందించబోతోందని పేర్కొన్నారు.కాగా, ఎన్నికల ప్రచారంలో అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులను ర్యాడికల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించారు. అలాంటి వాళ్లు అమెరికా గడ్డపై నివసించేందుకు ఏమాత్రం అర్హులు కాదని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జన్మతః పౌరసత్వ హక్కును కూడా రద్దు చేశారు. అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటించారు.ఈ నిర్ణయంతో లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. ఇక ట్రంప్ చర్యల నేపథ్యంలో అప్రమత్తమైన భారత ప్రభుత్వం భారతీయులను తిరిగి వెనక్కి రప్పించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

## ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు పవన్ కళ్యాణ్ తీపికబురు..

మొదటి పేజి తరువాయి

ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనల్ని స్వీకరిస్తున్నారు. అలాగే డీపీసికి సంబంధించి కూడా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులకు తీపికబురు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులకు పవన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ కసరత్తు ప్రారంభించారు.. అందుబాలో భాగంగా ప్రమోషన్లపై చర్చించేందుకు ఉద్యోగ సంఘాలతో బుధవారం సమావేశం నిర్వహించి.. వారి నుంచి సూచనలు, సలహాలను తీసుకుంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేగవంతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు ఈ ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ వేగవంతం చేయడానికి పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌లో సిబ్బంది కొరత లేకుండా చూస్తున్నారు. దీని కోసం పీఆర్ ఎస్టాబ్లిష్‌మెంట్ వింగ్‌లో ఐదుగురు సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించగా.. మరో నలుగుర్ని కూడా నియమించనున్నారు. అలాగే పదోన్నతుల అంశంలో ఇబ్బందులు ఎదురవ్వకుండా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఏటా డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖలో ఖాళీగా ఉన్న ఎంపీడీవో పోస్టులు భర్తీకి చర్యలు తీసుకోనున్నారు అధికారులు. గతంలో ఈ ప్రమోషన్ల ప్రక్రియకు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. పదోన్నతుల కోసం ఏర్పాటు చేసే డీపీసీ నియమించిన తర్వాత ఏర్పడ్డ ఖాళీలకు మళ్లీ డీపీసీ ఏర్పాటు చేసే వరకు మోక్షం ఉండేది కాదు. అంటే ఒక నెలలో డీపీసీ ఏర్పాటు చేసి ప్రమోషన్లు ఇచ్చిన తర్వాత.. ఆ తర్వాత నెలల్లో ఖాళీ అయ్యే పోస్టులకు.. డీపీసీ ఏర్పాటు చేసేవరకు పదోన్నతులకు అవకాశం ఉండేది కాదు. దీంతో చాలామంది ఉద్యోగులు ప్రమోషన్లు లేకుండా రిటైరయ్యేవారు. అందుకే పంచాయతీరాజ్‌శాఖ అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని భావిస్తోంది. అందుకే ప్రతి ఏటా డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతులే కాదు.. కారుణ్య నియామకాలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు అధికారులు కసరత్తు చేసి ఆ ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఇప్పుడు పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగ సంఘాలతో సమావేశం తర్వాత ప్రమోషన్ల ప్రక్రియ మొదలుపెట్టనున్నారు.

## ఏడు పాయింట్లతో ఆప్, మేనిఫెస్టో.. బీజేపీని ఇరుకునపెట్టేలా కీలక డిమాండ్లు

మొదటి పేజి తరువాయి

ఏడు అంశాలను ఈ మేనిఫెస్టోలో పెంచుపర్చారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర వార్షిక బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో బీజేపీని

ఆప్ కేంద్ర ప్రభుత్వం ముందుంచిన ఏడు డిమాండ్లు ఇవే..

1 కేంద్ర బడ్జెట్‌లో ఎడ్యుకేషన్ కేటాయింపులను 2 శాతం నుంచి 10 శాతానికి పెంచాలి. ప్రైవేట్ స్కూల్ ఫీజులపై ప్రభుత్వ నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.2. ఉన్నత విద్య చదివే వారికి సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. 3. హెల్త్ బడ్జెట్‌ను 10 శాతానికి పెంచాలి. అలాగే ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపులపై పన్ను రద్దు చేయాలి. 4. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుత రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. 5. నిత్యవసర సరకులపై జీఎస్టీని ఎత్తివేయాలి. 6. సీనియర్ సిటిజన్లకు బలమైన రిటైర్మెంట్ ప్లాన్, పెన్షన్ స్కీమ్స్ తీసుకురాలి. 7. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించాలి. దేశ వ్యాప్తంగా రైలు ప్రయాణ టికెట్లలో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ కల్పించాలి.పన్నుల ద్వారా వచ్చే సొమ్మును విద్యతో పాటు ద్రవ్యోల్బణం నుంచి మధ్యతరగతి వారిని కాపాడేందుకు తాము వినియోగిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఛార్జీలు, నీటి ఛార్జీలను తగ్గించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులను పెంచినట్లు గుర్తుచేశారు.ఆమ్ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఢిల్లీ సీఎం అతిషి సైతం పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో బీజేపీ నేతలు రౌడీయిజం చేస్తున్నారంటూ అతిషి ఫైర్ అయ్యారు.

ఎన్నికల బరిలో 699 మంది అభ్యర్థులు : ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నారు. 70 స్థానాల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థుల సంఖ్య పెరిగింది. అర్వింద్ కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. ఢిల్లీలో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గం ఇదే.ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించి.. 8 తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనుండటం తెలిసిందే.

# మెగా పెట్టుబడులు

మొదటి పేజి తరువాయి




మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ కం పెనీ కృష్ణారెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టుపై మేఘా ఎంఇఐఎల్ దాదాపు రూ.11 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నది. నిర్మాణ దశలో దాదాపు వె య్యి మందికి ఉద్యోగాలు లభించనున్నా యి. కార్యకలాపాలు ప్రారంభించిన తర్వా త అదనంగా మరో 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అవసరమైన ఉద్యోగుల నియామకాలకు కంపెనీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తుంది. ఈ చర్చల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 లక్ష్య సాధనలో పాలుపంచుకునేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు మే ఘా కంపెనీ అధినేత ప్రకటించారు. దీంతో పాటు మేఘా కంపెనీ బ్యాటరీ ఎనర్జీ స్టోరే జీ సిస్టమ్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు మ రో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రమంతటా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ప్రాజెక్టును స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయుపై సంతకాలు చేశాయి. రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రదేశాలలో 100 ఎంవీహెచ్‌ల బ్యాటరీ ఎనర్జీ స్టో రేజీ వ్యవస్థను ఈ కంపెనీ అభివృద్ధి చే స్తుంది. దీనికి రూ.3000 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. దీంతో రెండేండ్ల లో 1000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 3వేలమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుం ది. ఇంధన నిల్వ, గ్రిడ్ స్థిరత్వం, పీక్ లోడ్ నిర్వహణలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుంది. మేఘా కంపెనీ పర్యాటక రంగంలోనూ పెట్టుబడులకు ముందుకొచ్చింది. అనంతగిరిలో ప్రపంచస్థాయి లగ్జరీ వెల్నెస్ రిసార్ట్ ఏర్పాటు చేసేందుకు మెఘా కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మౌలిక సదుపాయాల సంస్థ భాగస్వామ్యంతో ఈ రిసార్ట్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే దాదాపు రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.

## చిన్నారి ఆర్టిస్ట్ వెన్నెలకు “ఇన్స్పిరేషనల్ గర్ల్ చైల్డ్” అవార్డు...




మంచిర్యాల జిల్లా ప్రతినిధి - శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) : పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనే ఆలోచన చిన్నారి వెన్నెలను చూస్తే అర్దం ఆవుతుందనీ... పాఠశాలకు పోయే వయసు నుండి తన తండ్రి అయిన ప్రముఖ ఆర్టిస్ట్, ఆర్ట్ టీచర్, చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు ఐన చిప్పకుర్తి శ్రీనివాస్ అడుగు జాడల్లో నడుస్తూ, బుజ్జి అడుగులతో పాటు చిత్రాలు గీయడం నేర్చుకుని తండ్రికి తగ్గ తనయ అని నిరూపించుకుందనీ... భవిష్యత్తులో పెద్ద ఆర్టిస్ట్ గా పేరు తెచ్చుకోవాలని ప్రముఖ సినీ నటి కవిత అన్నారు... ఇటీవల బిర్లా ప్లానిటోరియం హైదరబాద్ లో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలికలను ప్రోత్సహిస్తూ ఇన్స్పిరేషనల్ గర్ల్ చైల్డ్ అవార్డులను అందించారు... ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ చిప్పకుర్తి శ్రీనివాస్ కుమార్తె చిప్పకుర్తి వెన్నెలకు సినీ నటి కవిత చేతుల మీదుగా ఈ అవార్డును అందించారు... వెన్నెల ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతూ, చిత్రకళ లో మెళకువలు నేర్చుకుంటూ ఇప్పటికే ఎన్నో అవార్డులు పొందింది. చిన్నారి వెన్నెలను మంచిర్యాల జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఆశీర్వదించి అభినందనలు తెలిపారు...



## 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుండి గోదావరిఖని కి చెందిన ఎన్ స్వర్ణలత అంగన్వాడి టీచర్ ఎంపిక

రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి (శుభోదయం న్యూస్) : )76వ గణతంత్ర దినోత్సవం రాష్ట్ర లెవెల్ నుండి అంగన్వాడి టీచర్లు ఐదుగురిని ఎంపిక చేయడం జరిగింది. ఎంపిక చేసిన దానిలో పెద్దపెల్లి జిల్లా రామగుండం మండలంలోని గోదావరిఖని కి చెందిన ఎన్ స్వర్ణలత అంగన్వాడి టీచర్ ను ఎంపిక చేయడం జరిగింది. గోదావరిఖనికి చెందిన అంగన్వాడీ టీచర్ స్వర్ణలత ఎంపిక పట్ల అంగన్వాడి టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో

### నిరుపేద ముస్లిం అమ్మాయి వివాహం సందర్భంగా అన్నదాన కార్యక్రమం





గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయంన్యూస్) స్థానిక గాంధీనగర్ లోని వినోబా నగర్ కు చెందిన సయ్యద్ యూసుఫ్ అమ్మాయి ఈరోజు వారి గృహం నందు ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ద్వారా వివాహం జరపడం జరిగింది అనంతరం మరియు వివాహం అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్ లో 500 మందికి భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది ఈ వివాహం కి ఆర్థికంగా సహాయం అందించిన దాతలకు మరియు ఆర్గనైజేషన్ సభ్యులకు ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు షేక్ హాజీ అలీ,కృతజ్ఞతలు తెలిపారు వివాహంలో ఆర్గనైజేషన్ సభ్యులు మహమ్మద్ మునీర్ అధిక సంఖ్యలో ముస్లిం సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు, కొత్త ఆహార భద్రత కార్డులు అర్హులైన వారికి అందజేయడం జరుగుతుంది

### పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ నగరపాలక కమిషనర్ జె.అరుణశ్రీ






రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి(శుభోదయం న్యూస్)ఇందిరమ్మ ఇండ్లు , కొత్త ఆహార భద్రతా కార్డుల జాబితాలో అర్హుల పేర్లు రాకపోయినా , అనర్హులకు వచ్చినా వార్డు సభలోదృష్టికి తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 38 వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో నిర్వహించిన వార్డు సభలో ఆయన మాట్లాడుతూ గతంలో స్వీకరించిన ప్రజా పాలన ధరఖాస్తులు , మీ సేవ లో సమర్పించిన ధరఖాస్తులు,సమగ్ర ఇంటింటి సర్వే డేటా ఆధారంగా లబ్ధిదారుల జాబితా తయారు చేయడం జరిగిందని అన్నారు. వార్డు సభలో జాబితాలోని పేర్లను చదవడంతో పాటు ప్రదర్శనకు ఉంచామని అన్నారు.అర్హత ఉండి జాబితాలో పేర్లు లేనట్లయితే కొత్తగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త ధరఖాస్తులను మునిసిపల్ కార్యాలయంలోనూ స్వీకరించడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ వార్డు సభలో చదువుతున్న జాబితాలో పేర్లు ఉన్న వారు మళ్ళీ ధరఖాస్తు చేసుకోవల్సిన అవసరం లేదని అన్నారు. కొత్త ధరఖాస్తు సమర్పించడానికి ముందు ప్రదర్శనకు ఉంచిన జాబితాలో పేరు లేదని నిర్ధారించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగపల్లి సరోజన , నగర పాలక సంస్థ ఇ ఇ రామన్ అసిస్టెంట్ కమిషనర్ రాయలి%శీ%గు తదితరులు పాల్గొన్నారు. కాగా వార్డు సభలు బుధవారం 3,4, 8,9,13,18,19, 23,24,28,29,33,34,38,39,43,44,48,49 వ డివిజన్ లలో నిర్వహించగా గురువారం 5,10,14,15,20,25,30,35,40,45,50 డివిజన్ లలో జరగనున్నాయి.

## పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

## సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ కొనసాగించాలి

### ఖని 33వ డివిజన్ లో జరిగిన వార్డ్ సభలలో అధికారులను కోరిన మద్దెల దినేష్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) రామగుండం నగర పాలక సంస్థలోని 33వ డివిజన్ లో నిర్వహించిన వార్డు సభలో అధికారులు పాల్గొని రేషన్ కార్డులు, మరియు ఇందిరమ్మ గృహాల దరఖాస్తుల స్వీకారణ ప్రారంభించడం.జరిగిందన్నారుఫైట్ ఫర్ బెటర్ సొసైటి అధ్యక్షులు మద్దెల దినేష్ 33డివిజన్ లోని అర్హులైన ప్రజలకు రేషన్ కార్డులవి మరియు ఇందిరమ్మ గృహాల దరఖాస్తులు వ్రాసి, మరియు కొంతమందికి అవగాహన కల్పించి ఆధికారులకు ప్రజల పక్షాన ధరఖాస్తులుఅందజేయడం.జరిగిందన్నారఅనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు అందేలా చర్యలు చేపట్టాలని, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని వారు అధికారులను కోరామన్నారు.పథకాల పేరుతో ప్రజలను అయోమయానికి గురి చేయద్దు అన్నారు.గత ఏడాది వచ్చిన ప్రజా పాలనదరఖాస్తులు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు సేకరించిన సంబదించిన అధికారులు చాలవరకు అర్హులైన వారికి విడుదల చేసిన జాబితాలలో పేర్లు లేక పోవడంతో అర్హులైన ప్రజలు నిరుత్సాహానికి.గురైతున్నారనిపదే పదే దరఖాస్తులు పెట్టుకుంటున్నా అర్హత జాబితాలలోకి మాత్రం మా పేర్లు రావడం లేదని వాపోయారు.ముఖ్యంగా వితంతువులు, దివ్యాంగులు, దారిద్ర దిగువ రేఖకు చెందిన వారిని, అత్యంత నిరుపేదలను గుర్తించి మెదటి ప్రాధాన్యతగా వారి అర్హత జాబితా సిద్ధం చేయాలన్నారు.ప్రభుత్వము ప్రజలకు ఇవ్వదలుచుకొన్న సంక్షేమ పథకాలు పాలకులు, అధికారులు వారి వారి ఇష్టానుసారము వారికి అనుకూలమైన వారికో లేదా నచ్చిన వారికో ఇస్తే నిజంగా అర్హులకు మొండి చెయ్యి ఇయ్యక తప్పదన్నారు.కావున దయచేసి ఈ విధానానికి స్వస్తి పలుకుతూ ప్రజాపాలనలో భాగంగా నేడు పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలు నిజంగా అర్హులకే ఇస్తూ మీ పేరును పది కాలాలపాటు పదిలాంగా తలుచుకుంటారన్నారు.పాలకుల, అధికారులు వారి పొరపాటు, అత్యుత్సాహము కారణంగా ఒక పేదవాడు ఇంకా పేదవాదుగానే మిగిలిపోవడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మీరే కారకులు కావద్దని విన్నవిస్తూ ఏండ్ల నుండి ఈ పథకాల కోసం అర్హులైన వారువేచిచుస్తున్నారన్నారు.కావున పారదర్శకంగా పథకాలను అర్హులకే అమలు చేయాలని దినేష్ అధికారులను కోరారు.

## మున్నూరు కాపు మండల యూత్ అధ్యక్షులుగా బొగడమీది సాయి





బీర్కూర్, మండల రిపోర్టర్ - పవన్ కుమార్ (శుభోదయం న్యూస్): మున్నూరు కాపు యువత బీర్కూర్ మండల కమిటీని బుధవారం ఎన్నుకోవడం జరిగింది. మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ పటేల్ ఆదేశాలనుసారం మున్నూరు కాపు యువత రాష్ట్ర కార్యదర్శి దొంగ్లీ శ్రీనివాస్ పటేల్ కొమ్ము ధనుంజయ్ బాన్సువాడ యువత కన్వీనర్ ఆధ్వర్యంలో నియమక పత్రాన్ని అందించడం జరిగింది. మున్నూరు కాపు యువత బీర్కూర్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొగడమీది సాయి, ఉపాధ్యక్షులుగా కళ్ళ సాయికుమార్, కార్యదర్శిగా గంగాధర్, సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా రేంజర్ల అనిల్, కోశాధికారిగా మేకల గాలు, సోషల్ మీడియా కన్వీనర్ కొట్టే వినేష్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యువత మండల అధ్యక్షులు సాయి మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని మున్నూరు కాపు మండల యువత అధ్యక్షులు బొగడమీది సాయి తెలిపారు.

## ఘనంగా సన్మాన కార్యక్రమము



బీర్కూర్, మండల రిపోర్టర్ - పవన్ కుమార్ (శుభోదయం న్యూస్): కళాశాలకు వివిధ రకాల సేవలు అందించినందుకు గాను సతీష్ చంద్ర ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి అభినందించారు.కామారెడ్డి జిల్లా మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి నందు సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న సతీష్ చంద్ర తన 25 సంవత్సరాల సర్వీస్ ను విజయవంతంగా పూర్తి చేసుకొని, వృత్తి లో భాగంగా కళాశాల కు వివిధ రకాల సేవలు అందించినందుకు గాను, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ మీనా, అకాడమిక్ కో ఆర్డినేటర్ వనజ తో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అతన్ని సన్మానించి అభినందనలు తెలియజేసారు.

## బీర్కూర్ మండలంలో 2వ రోజు కొనసాగుతున్న గ్రామ సభలు



బీర్కూర్, మండల రిపోర్టర్ - పవన్ కుమార్ (శుభోదయం న్యూస్) : బీర్కూర్ మండలంలోని భైరాపూర్, తిమ్మాపూర్ మరియు దామరంచ గ్రామ పంచాయతీ లలో 1) కొత్త రేషన్ కార్డులు 2) ఇందిరమ్మ ఇండ్లు 3) రైతు భరోసా 4) ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరూ జాబితాల్లో పేర్లు రాకపోతే వచ్చి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో ఎంపీడీఓ , ఎం ఆర్ ఓ మరియు మండల ప్రత్యేక అధికారి ఎఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, మాజీ ఎంపీపీ రఘు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యాదవ్..లు రాజకీయంగా ఎదగాలి..: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



వరంగల్, (శుభోదయం న్యూస్ ): గొల్లకురుమలు, రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.బుదవారం రోజున గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం జి.ఎం.పి.ఎస్.వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడినారు.అనంతరం క్యాలెండర్ ను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న,టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య,జిల్లా కార్యదర్శి పరికి మధుకర్,జిల్లా ఉపాధ్యక్షులు కావటి సారయ్య,సహాయ కార్యదర్శి చందు మల్లేష్,జిల్లా కమిటీ సభ్యులు జక్క రవి,పులిపాటి శ్రీనివాస్,కుండే లింగస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## దూడేల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా



వరంగల్, (శుభోదయం న్యూస్ ): పర్వతగిరి మండలంలోని గోపనపల్లి గ్రామంలోని శ్రీ దూడేలా మల్లికార్జునస్వామిని బుధవారం రోజున వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దర్శించుకొని ప్రత్యేక పూజలు



నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లడ్డు ప్రసాదం అందించి,శాలువాతో సత్కరించడం జరిగింది.అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆలయ చైర్మన్ రాధిక-రాజు ను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గుండా రాజేంద్రప్రసాద్,అశోక్,మొహబూబ్ పాషా,ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల పేరుతో మరో కొత్త నాటకానికి తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం

### బిఆర్ఎస్ రాష్ట్ర యువత అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): గ్రామసభల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాటకానికి తెర లేపిందని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు విమర్శించారు బుధవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజలను మభ్యపెట్టే నాటకాలకు తెరలేపిందని విమర్శించారు. గ్రామసభ కార్యక్రమాల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పథకాలను అసలైన అర్హులకు కాకుండా తమ పార్టీ కార్యకర్తలకే కేటాయిస్తున్నట్లు ఆరోపించారు. మహబూబ్నగర్లో జరిగిన ఒక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ఈ ఆరోపణకు నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే పథకాలు కేవలం కార్యకర్తలకే అందుతాయన్న ప్రకటన సిగ్గుచేటుని అన్నారు.గ్రామసభల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ, ప్రతిరోజూ కొత్త సర్వేలు, నాటకాలతో హామీలను విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలు ప్రజాసేవ కోసం కాకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు.రాష్ట్రంలో పథకాలను అసలైన అర్హులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అందజేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజల తరుపున పోరేడేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ సమగ్ర పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జిన్నారం వెంకటేశం గౌడ్, సీనియర్ నాయకులు దేవేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి సత్యనారాయణ, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, తుపాకుల రాజు , ఆంజనేయులు యాదవ్, వాసు దేవ రెడ్డి ,అమ్మగారి సదానంద రెడ్డి, జైపాల్ రెడ్డి ప్రవీణ్ రెడ్డి, నల్తూరి యాదగిరి పెంటయ్య శంకర్ నాయి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొడకంచిలో ప్రజాపాలన గ్రామసభ

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు : ఆర్డీవో రవీందర్ రెడ్డి
### అర్హులకు మళ్లీ దరఖాస్తు చేసుకునే చాన్స్ : ఎమ్మార్వో బిక్షపతి



జిన్నారం, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో ఇందిరమ్మ సంక్షేమ పథకాలు ప్రజాపాలన గ్రామసభ జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క గ్రామసభ ప్రజాపాలన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విశ్లేషణాత్మకంగా జిన్నారం మండల తహసిల్దార్ బిక్షపతి వివరించి గ్రామసభ నిర్వహించారు. ఇట్టి గ్రామ సభను సంగారెడ్డి జిల్లా ఆర్డీవో రవీందర్ రెడ్డి సందర్శించడం జరిగింది. గ్రామంలోని వెయ్యేల చరిత్ర కలిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆదినారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరిగింది. అర్హులైన



ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ సంక్షేమ పథకాలు అందాలని ఇందులో ప్రభుత్వం నిర్ణయించినట్లుగా పథకాలను వివరించాలని వారు మాట్లాడుతూ గ్రామాల్లో పథకాల సందడి మొదలైంది. ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా ఇలా నాలుగు పథకాల లబ్దిదారుల ఎంపికకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, డివిజన్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. మండల తహసిల్దార్ బిక్షపతి మాట్లాడుతూ ఇక్కడ 4 స్కీములకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ప్రదర్శిస్తారు.వారిలో అర్హులు ఎవరో అక్కడి ప్రజల ద్వారా నిర్ణయిస్తారు. అక్కడ నిర్ణయించిన జాబితాను ఖరారు చేసి పథకాలను అమలు చేస్తారని జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు గ్రామ సభల్లో కొత్తగా అప్లికేషన్లు తీసుకోనున్నారు. రేషన్ కార్డుల జాబితాలో తమ పేరు లేని వారు దరఖాస్తు చేసు కోవడం, వారందరివి మరోసారి పరిశీలించి వారిలో అర్హులైన వారికి కొత్త కార్డులు ఇవ్వను న్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హులుగా ఉండి ఎంపిక కాని వారు గ్రామ సభలో అప్లయ్ చేసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల తహసిల్దార్ బిక్షపతి, కొడకంచి గ్రామపంచాయతీ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, జిన్నారం మండల ఎస్సై నాగలక్ష్మి, మండల అధికారులు వైద్య సిబ్బంది అంగన్వాడీ ఆశ వర్కర్లు, తాజా మాజీ ఉప సర్పంచ్ అభిలాష్ గౌడ్, వార్డు సభ్యులు హరిశంకర్ గౌడ్, పాతూరి మల్లేష్, మక్తల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దికుంట నాగరాజు, మద్దికుంట వీరేందర్ గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్,డైరెక్టర్ ల పదవి ప్రమాణ స్వీకారోత్సవ ఆహ్వానం

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈతాపరాములు



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో గురువారం ఉదయం 12.00 గంటలకు దేవిశ్రీ ఫంక్షన్ హాల్ లో వలిగొండ రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు డైరెక్టర్లుగా పదవి ప్రమాణ స్వీకారం చేయబోతున్న భీమా నాయక్ చైర్మన్ గా పాలక మండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆశీర్వాదంతో, వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ గా,మరియు డైరెక్టర్లు గా ప్రమాణ స్వీకరం చెయ్యబోతున్న సందర్బంగా ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర్ రావు, రోడ్లు భవనాలు మరియు సినిమాటోగ్రాఫి శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు,మచ్చగిరి గుట్ట చైర్మన్ డైరెక్టర్లు మహిళామణులు మండల నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీ లు,మాజీ సింగిల్ విండో చైర్మన్లు,మాజీ సింగిల్ విండో డైరెక్టర్లు యూత్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా మండల యూత్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు రైతు నాయకులతో పాటుప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని కోరుతున్నాను.

## వ్యక్తి అదృశ్యం పై కేసు నమోదు చేసిన పోలీసులు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్ ):- ఎల్లారెడ్డికి చెందిన అల్లం శాంత ఫిర్యాదు మేరకుఆమె భర్త అయినా అల్లం రాములు ఎల్లారెడ్డి నందు కూలి పని చేసుకుని జీవిస్తాడు. ఆమె భర్త రాములు గత మూడు నెలల నుండి తనకు కాలు నొప్పి అవ్వడంతో పనికి వెళ్లడం లేదు. నొప్పి తగ్గిన తర్వాత కూడా ఆమె భర్త పనికి వెళ్ళకపోవడంతో ఆమెకు, భర్తకు చిన్నచిన్న విషయాలకు గొడవలు జరుగుతున్నాయి. తేదీ: 12.01.2025 నాడు సాయంత్రం ఆమెకు, భర్తకు పని విషయమై గొడవ జరిగినది. ఆ తర్వాత వారు రాత్రి అందాజా 10 గంటలకు తిని పడుకున్నారు. తర్వాత తేదీ: 13.01.2025 నాడు ఉదయం 8 గంటలకు ఆమె నిద్రలోనుండి మేల్కొని చూసేసరికి ఇంట్లో ఆమె భర్త కనిపించలేదు. రాములు తన ఫోన్ ఇంట్లో పెట్టి సిమ్ తన వెంట తీసుకువెళ్లినాడు. ఆమె తన భర్త కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి దగ్గర వెతకగా తన ఆచూకీ ఎక్కడ దొరకలేదు అనే ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది అని ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపినారు.

## ఆర్డిఓ ఎల్లారెడ్డి గారిని సన్మానించిన

## సహచట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్):- బుధవారం ఎల్లారెడ్డి డివిజన్లోని ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డిఓ మన్నె ప్రభాకర్ గారిని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మాజీ న్యాయమూర్తి శాలువాతో సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఆర్టీవో నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరిస్తూ ఎల్లారెడ్డిలో ఆర్ టి ఐ లింగంపేట్ మండల వైస్ ప్రెసిడెంట్ గా పనిచేస్తున్న యాదగిరి



గౌడ్ కు ఐడి కార్డ్ అందజేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లారెడ్డి డివిజన్లోని అన్ని ప్రభుత్వ శాఖల కు దరఖాస్తు చేసుకున్నాచో 30 రోజులలో కావలసిన సమాచారాన్ని తీసుకోవచ్చని అన్నారు. అలాగే ప్రజలలో పారదర్శకత జవాబు జారీతనం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు.సమాచారాకు చట్టం పేద ప్రజలకు ఒక వజ్రాయుధం లాంటిదని అన్నారు. అలాగే సమాచార హక్కు చట్టం 2005 అభివృద్ధి కొరకు కృషి చేస్తున్న ఎల్లారెడ్డి డివిజన్ కార్యదర్శి దండగులా లింగమయ్య,యాదగిరి గౌడ్, పల్లెపు రాజు తదితరులను ఆర్డిఓ గారు అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర క్యారెక్టర్ ఏం ఏ సలీం మరియు దండగుల లింగమయ్య, యాదగిరి గౌడ్ మరియు పల్లెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలకు సేవలనుదించిన

## సతీష్ చంద్ర ను కళాశాల ప్రిన్సిపల్ అభినందించారు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభదయం న్యూస్):- మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి నందు సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న సతీష్ చంద్ర తన 25 సంవత్సరాల సర్వీస్ ను విజయవంతంగా పూర్తి చేసుకొని, వృత్తి లో భాగంగా కళాశాల కు వివిధ రకాల సేవలు అందించినందుకు గాను, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ మీనా, అకాడమిక్ కో ఆర్డినేటర్ వనజ తో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అతన్ని సన్మానించి అభినందనలు తెలియజేసారు.

## విగ్రహం పెట్టేందుకు అనుమతికి కమిషనర్ కు వినతి




మోత్కూరు, మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని డివైడర్ లో విగ్రహాలు పెట్టుకోవడానికి అనుమతి ఇస్తున్నారని తెలియడంతో మున్సిపల్ కేంద్రానికి చెందిన బొడిగె శ్రీహరి తన తండ్రి విగ్రహం పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కేంద్రానికి సంబంధం లేని వ్యక్తుల విగ్రహాలను డివైడర్ లో పెడుతున్నారని, ఎవరి ప్రయోజనం కోసమో దాతల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. శ్మశాన వాటిక లో స్మారకంగా నిర్మించుకున్న వందల మంది గోరీలను మున్సిపల్ పాలకవర్గం కూల్చారని, అందులో నా తండ్రి స్మారకార్థంగా నిర్మించుకున్న గోరిని కూడా కూల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరుకు సంబంధం లేని బయటి వ్యక్తుల విగ్రహాలకు పర్మిషన్ ఇస్తున్నారని, ప్రస్తుతం డివైడర్ లో ఓ వ్యక్తి విగ్రహం పెట్టేందుకు దాతల నుంచి రూ.12 లక్షలు వసూలు చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయని తెలిపారు. స్మశానంలో కూల్చిన వారందరికీ పర్మిషన్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. నా స్వంత ఖర్చులతోనే నా తండ్రి విగ్రహం ఏర్పాటు చేసుకుంటానని, త్వరగా అనుమతి ఇవ్వాలని కమిషనర్ ను కోరారు.

## పద్మశాలి క్యాలెండర్ ను ఆవిష్కరించిన డివిజన్ అధ్యక్షుడు దేవసాని పోశెట్టి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్ ):-ఎల్లారెడ్డి, లింగంపేట్ పద్మశాలి సంఘంలో జిల్లా పద్మశాలి సంఘం గ్రామ పెద్దల సమక్షంలో కుల బంధువుల సమక్షంలో,2025 సంవత్సరపు నూతన క్యాలెండర్ ను ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు దేవసాని పోశెట్టి, లింగంపేట అధ్యక్షుడు పారి పల్లి సంతోష్ సంఘ సభ్యులతో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లోపరస కాశిరాం, పారి పల్లి రాములు, మధునాల రాజు, సంఘ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో ప్రజా పాలన వార్డు సభా సమావేశం



మోత్కూరు మండల రిపోర్టర్( శుభోదయం న్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ 10వ వార్డు లో ప్రజా పాలన వార్డు సభా సమావేశం ధర్మాపురం లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 10 వ వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొని మాట్లాడారు అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు,రైతు భరోసా వస్తాయన్నారు.లబ్ధి దారుల జాబితాలో తమ పేరు లేని వారు మళ్ళీ ఈరోజు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రితో చర్చిస్తా మంత్రి సీతక్క

### మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర జంగయ్య యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి



మేడిపల్లి, మండల రిపోర్టర్ –బైరెడ్డి సందీప్ రెడ్డి (శుభోదయం న్యూస్): తెలంగాణ రాష్ట్రములోని జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవి కన్వెన్షన్ హాల్ లో జరిగిన మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇండ్లకు ప్రజాపాలన వచ్చాకా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. సమాజంలో నాలుగో స్థంభమైన మీడియాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.జర్నలిస్టుల ఆరోగ్య భద్రత గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి ప్రెస్ అధ్యక్షుడు కల్వారి ఎల్లయ్య అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శు గడ్డమిది బాల్ రాజు గౌడ్, డీ.వెంకట్ రాం రెడ్డిబోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, అమర్ సింగ్,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి,డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిర్ర శ్రీధర్ రెడ్డి,కోశాధికారి ఎన్ రాము యాదవ్ , డైరీ కమిటీ కన్వీనర్ వి.సుందర్, కార్పొరేటర్లు, క్లబ్ కార్యవర్గ సభ్యులు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఒలంపియాడ్ క్యాట్ లెవెల్2 పరీక్ష ఫలితాల్లో

## బోడుప్పల్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

### విద్యార్థులను అభినందించిన, ఏజీఎం సయ్యద్ ఖాసిం అలీ,ప్రిన్సిపాల్ రాజేందర్



మేడిపల్లి, మండలం రిపోర్టర్ – బైరెడ్డి సందీప్ రెడ్డి (శుభోదయం న్యూస్ ): జాతీయస్థాయిలో నిర్వహించిన ఒలంపియాడ్ క్యాట్ లెవెల్2 పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాల బోడుప్పల్ బ్రాంచ్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజేందర్ మాట్లాడుతూ.పరీక్షకు హాజరైన 42 మంది విద్యార్థులకు 42 మంది విద్యార్థులు ప్రతిభచాటారని అన్నారు.జాతీయ స్థాయి ఒలంపియాడ్ క్యాట్ లెవెల్2పరీక్ష ఫలితాల్లో ఐదుగురు విద్యార్థులకు ?1000 క్యాష్ రివార్డ్ మెడల్ మెరిట్ సర్టిఫికెట్ సాధించారని తెలిపారు.21 మంది మెడల్ మెరిట్ సర్టిఫికెట్ సాధించారు16 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్ సాధించారనిఅన్నారు.ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏజీఎం సయ్యద్ కాసిం అలీ,ప్రిన్సిపల్ రాజేందర్, విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ రమేష్,అకాడమిక్ డేన్ దీపక్,సీ ఇంచార్జ నరేష్,ఒలంపియాడ్ ఇంచార్జ భవాని,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మోత్కూర్ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో ఇటీవల సిలిండర్ పేలి మొండే అండాలు ఇల్లు దగ్ధమైంది.విషయం తెలుసుకున్న రాజామాత ఫౌండేషన్ సభ్యులు బుధవారం బాధితురాలికి రూ.8 వేల నిత్యవసర సరుకులు మోత్కూర్ ట్రైనింగ్ ఎస్ఐ. ఎండి సోహెల్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు, మనోజ్ రెడ్డి సభ్యులు వెంకటనారాయణ రెడ్డి, సోంబాబు, వెంకన్న, యాదగిరి, లింగయ్య పాల్గొన్నారు.

## శంకర్ పల్లిలో రోడ్ సేఫ్టీ

### అవగాహన సదస్సు లో పాల్గొన్న కొండాపూర్ డిటిసి సదానందం




శంకర్పల్లి, (శుభోదయం న్యూస్ ): శంకర్పల్లిలో ప్రజలకు రోడ్డు ఆగాన సదస్సు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రోడ్డుపైన వెహికల్ నడుపుతున్నప్పుడు ఎలిమెంట్ కచ్చితంగా ధరించాలని బైకు పైన ఇద్దరి కన్నా ఎక్కువ మంది కూర్చొని వెళ్లకూడదని చెప్పారు ఎలుమెంటు లేకుండా వెహికల్ నడిపినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రమాదాలు జరిగినప్పుడు మధ్యతరగతి కుటుంబంలో అనుకోని సంఘటన జరిగినట్లయితే అట్టి కుటుంబ సభ్యులు రోడ్డు పాలు అవుతున్నారు ఆ విధముగా జరగకుండా ఇంట్లో నుండి బయటకు వెళ్ళేటప్పుడు ఎలిమెంట్ ధరించి వెళ్లాలని సూచించారు ఈ కార్యక్రమంలో శంకర్పల్లి పోలీసులు ట్రాఫిక్ పోలీస్ వారు శంకర్పల్లి స్కూల్ విద్యార్థులు మరియు టీచర్లు మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్ గారు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి
## చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బేబీ నాయన గారు..



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):బొబ్బిలి మండలం, గొంగాడవలస గ్రామానికి చెందిన గొంగాడ అప్పారావు గారు అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే గారి దృష్టికి రావడంతో, సీఎం సహాయనిధి నుంచి రూ25,000/- ల ఆర్థిక సహాయం అందేలా కృషి చేసి, ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ చెక్కును ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) అందజేశారు..!!

## బలంగా ఢీ కొట్టుకున్న రెండు లారీలు..
## భారీగా నిలిచిన వాహనాలు...



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):ఎదురెదురుగా రెండు లారీలు బలంగా ఢీకొన్నాయి. బొబ్బిలి మండలం గొర్ల సీతారాంపురం వద్ద బుధవారం తెల్లవారుజాము మూడు గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంటుంది. గ్రోత్ సెంటర్ నుంచి రాంబద్రపురం వరకు ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదు. స్వల్ప గాయాలతో డ్రైవర్, క్లీనర్ బయటపడ్డారు. కానీ అంతర్ రాష్ట్ర రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బొబ్బిలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## “రామభద్రపురంలో
## త్రినేత్ర డయాగ్నోస్టిక్ సెంటర్ ను ప్రారంభించిన.....
### ఎమ్మెల్యే బేబీనాయన మరియు బుడా చైర్మన్ తెంటు లక్ష్మ నాయుడు..



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్...(శుభోదయం న్యూస్): బొబ్బిలి నియోజకవర్గం, రామభద్రపురం హెడ్ క్వార్టర్ లో ఈరోజు రామభద్రపురానికి చెందిన వైకుంఠం వాసుదేవరావు మరియు రామినాయుడు గారి “త్రినేత్ర డయాగ్నోస్టిక్ సెంటర్” ను ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మరియు బుడా చైర్మన్ తెంటు లక్ష్మ నాయుడు పాల్గొన్నారు.అత్యాధునిక సదుపాయాలతో రామభద్రపురంలో ఈ డయాగ్నోస్టిస్



సెంటర్ ను ఏర్పాటు చేసిన వాసుదేవరావు గారు మరియు రామినాయుడు గారుని ఎమ్మెల్యే బేబీనాయన గారు అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చింతల రామకృష్ణ, రామభద్రపురం మండలం టీడీపీ అధ్యక్షుల కరణం భాస్కరరావు, రామభద్రపురం ఎంపీటీసీ సభ్యులు వసంతుల తిరుపతిరావు శ్రీ బవిరెడ్డి చంద్రరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు..!!

## పాడి రైతులు
## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : ఏపీ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు మేలు చేసే విధంగా పశు ఆరోగ్య శిబిరాలను ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని మిట్టగుడిపాడు గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని



ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి షేక్ బషీర్ పశువుల్లో గర్భాశయ వ్యాధులు, ఇతర వ్యాధులకు చికిత్స అందించారు. ఆవులకు గర్భకోస చికిత్స, చూడి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పశు వైద్య శిబిరంలో 51 మంది పశు పోషకుల ఆవులు, గేదెలకు చికిత్సతో పాటు 1150 జీవాలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు,నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు బాబు, రమేష్ నాయక్, త్రివేణి, భవిత తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిచర్ల ముత్యాలపాడు పొలం పిలుస్తుంది కార్యక్రమం



లింగసముద్రం, మండల రిపోర్టర్ - సురేష్ (శుభోదయం న్యూస్ ):మొగిలిచర్ల,ముత్యాలపాడు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తున్న కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ మాట్లాడుతూ యూరియా వరిలో తగిన మోతాదులో వాడుకోవాలని తెలియజేశారు మరియు జింక్ లోప సవరణకు రెండు గ్రాముల జింక్ ఒక లీటరు నీటిలో కలిపి పొలంలో పిచికారి చేయవలసిందిగా సూచించారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు దీప ప్రేమ్ బాబు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## : చికెన్ తినేవారికి బిగ్ షాక్,
## కోళ్లకు అంతుచిక్కని వైరస్, లక్షల్లో మృతి



పశ్చిమగోదావరి జిల్లా, (శుభోదయం న్యూస్): కోళ్లను మృత్యువాత పడేలా చేస్తున్న అంతుచిక్కని వైరస్ పశ్చిమగోదావరి జిల్లాను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. సాయంత్రం ఆరోగ్యంగా కనిపించే కోడి, తెల్లవారుజామున చనిపోతున్న దారుణ పరిస్థితులు నెలకొన్నాయి.ఈ వ్యాధి కారణంగా జిల్లాలో ఇప్పటివరకు లక్షకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయని తెలుస్తోంది. ముఖ్యంగా పందేలు కోసం ప్రత్యేకంగా పెంచిన కోళు కూడా వైరస్ బారిన పడి మరణించాయి, దీంతో కోళ్ల పెంపకందారులు భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారు.ఇదే వైరస్ నాలుగేళ్ల క్రితం కూడా పశ్చిమగోదావరిలో కోళ్లను తీవ్రంగా ప్రభావితం చేసింది. అప్పట్లో కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోవడంతో మార్కెట్‌లో అమ్మకాలు పూర్తిగా పతనమయ్యాయి. వైరస్ తగ్గుముఖం పట్టడానికి చాలా రోజులు పట్టింది. ఇప్పుడు మరోసారి ఇదే వైరస్ తిరిగి ప్రబలుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వైరస్ సోకిన కోడికి ప్రత్యేకమైన లక్షణాలు కనిపించవు. ఉదయం ఆరోగ్యంగా ఉన్న కోడి, మధ్యాహ్నానికి లేదా సాయంత్రానికి చనిపోతుంది. వైద్యుల ప్రకారం.. ఈ వైరస్ కోడి గుండెపై నేరుగా ప్రభావం చూపిస్తుంది.గుండె చుట్టూ నీరు చేరి గుండెపోటుతో కోడి మరణిస్తుంది. వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నప్పటికీ, వైరస్ సోకిన కోళ్లకు అది పని చేయడం లేదు.వైరస్ సోకిన కోడి వల్ల సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర కోళ్లకు కూడా వైరస్ సోకే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కోళ్ల మధ్య వేగంగా వ్యాపించే ఈ వైరస్ కారణంగా కొన్ని గంటల్లోనే పెంపక కేంద్రాల్లోని అన్ని కోళ్లు చనిపోతున్నాయి.మృత్యువాత చెందిన కోళ్లను రహదారుల పక్కన సంచుల్లో వేయడం వల్ల వైరస్ మరింత వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.కోళ్ల కళేబరాలను 3 అడుగుల లోతైన గోతిలో పూడ్చి, సున్నం వేసి నశింపజేయాలని, లేదా కాల్చేయాలని సూచిస్తున్నారు. ఈ విధంగా చేస్తే వైరస్ వ్యాప్తి నుంచి మిగిలిన కోళ్లను రక్షించవచ్చు.వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో కోళ్ల మాంసం తినడం ప్రమాదకరమని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు మాస్కులు, గ్లవ్స్ వంటివి ఉపయోగించి జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ వైరస్ కారణంగా మార్కెట్‌లో కోళ్ల ధరలు పడిపోవడం, అమ్మకాలు తగ్గడం వంటి పరిణామాలు ఏర్పడే అవకాశముందని పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవైరస్ ప్రభావాన్ని తగ్గించేందుకు కోళ్లను గుంపులుగా ఉంచకుండా, శుభ్రత పాటిస్తూ, ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని వ్యాపారులు, పెంపకందారులకు వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేరాలపై నిఘా నేత్రం...!

‘సురక్ష’ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు కృష్ణప్రసాదు .



ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, (శుభోదయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ‘సురక్ష’ కార్యక్రమంలో భాగంగా 2025 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్ లో బుధవారం సాయంత్రం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రివర్యులు శ్రీమతి వంగలపూడి అనిత గారు, డీజీపీ శ్రీ ద్వారకా తిరుమలరావు , విజయవాడ సీపీ శ్రీ రాజశేఖర్ బాబు , ప్రభుత్వ విప్ శ్రీమతి తంగిరాల సౌమ్య , ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) , సహచర ఎమ్మెల్యేలు శ్రీ కొలికేపూడి శ్రీనివాసరావు గారు, శ్రీ గద్దె రామ్మోహన్ , శ్రీ యలమంచిలి సుజనా చౌదరి , శ్రీ



బొండా ఉమామహేశ్వరరావు గారు, శ్రీ శ్రీ రాం రాజగోపాల్ తో కలసి మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తమ పోలీసింగ్ ఇవ్వడానికి విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. శాసన వ్యవస్థ, పోలీసు వ్యవస్థ కలసి పనిచేస్తే ఏ విధంగా ఉంటుందో అని చెప్పడానికి విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఒక నిదర్శనం అన్నారు. ట్రాఫిక్ విషయంలో కూడా మెరుగైన చర్యలతో ట్రాఫిక్ జామ్ కాకుండా, జంక్షన్ల క్రాసింగ్ల వద్ద ఎక్కువ సమయం పట్టకుండా చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుదన్నారు. పోలీసు శాఖ సమర్ధవంతంగా పనిచేస్తోందన్నారు. ప్రజలను రక్షించడంలో డ్రోన్స్, సీసీ కెమెరాల వంటి నూతన టెక్నాలజీ వినియోగం అవసరం అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయటంలో పోలీసులు సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపాధి హామీ పథకం
## పనులు గురించి మాట్లాడిన ఎంపీడీవో కట్టా శ్రీనివాసరావు




లింగసముద్రం, మండల్ రిపోర్టర్ - సురేష్ (శుభోదయం న్యూస్ ):లింగసముద్రం మండల పరిషత్ కార్యాలయం నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గారి కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలోజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి మీటింగు ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశం నందు ఎంపీడీవో కట్ట శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిరోజు లేబర్ పని కల్పించవలెను రాబోయే కాలానికి వర్కులు గుర్తించుటకు ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయుటకు ఫారం ఫండ్స్. అమృత సరోవర్ సన్నకారు రైతులు గడ్డి పెంపకమునకు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులకు మరియు టెక్నికల్ అసిస్టెంట్ల మరియు ఈసీ కోటయ్య పాల్గొనడం అయినది.

## తనకల్లులో రహదారి భద్రత అవగాహన కార్యక్రమం




తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్):రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం లో భాగంగా ఈ రోజు తనకల్లు లో రవాణా మరియు పోలీస్ వారి ఆధ్వర్యంలో వాహన డ్రైవర్స్, యజమానులు మరియు ప్రజలకు రహదారి భద్రత పైన అవగాహన కల్పంచడమైనది.తనకల్లు గోపి మాట్లాడుతూ వయస్సు నిండని పిల్లలతో వాహనాలు నడిపకంచరాదు. తలిదండ్రులు బాధ్యత గా ప్రవర్తిస్తే బాగుంటుంది అన్నారు.వరప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరము లు నిండినవారు మాత్రమే లైసెన్స్ తీసుకో డానికి అర్హులు అన్నారు అలాగే మోటార్ సైకిల్ నడిపే వారు విధిగా హెల్మట్ ధరించాలన్నారు.స్పీడ్ గా వాహనాన్ని నడపరాదు అలాగే వాహనం పైన సరైన అవగాహన లేకుండా నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోరాదన్నారు. ఆటో లలో పరిమితి కి మించి ప్రయానీకులను తీసుకు వెళ్ళరాదన్నారు. రహదారి సూచనలు పాటించా లని ప్రమాదలు నీవరించాలని పిలుపునిచ్చారు.సుమారు 150 మంది డ్రైవర్స్, వాహనం యాజమాన్యం మరియు ప్రజలు పాల్గొన్నారు. అందరికి కరపత్రం పంపిణి చేశారు.

## విద్యార్థినులను అభినందించి ,స్కాలర్షిప్ లు అందజేసిన బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ



ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్) : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద పామూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి 5000 రూపాయల వంతున బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ విద్యార్థినులకు అందజేశారు. మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అత్యాల జోష్నారాణి, ఎండ్లూరి సౌమ్య, పామూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన పాలేటి జెస్సి ఈ స్కాలర్షిప్ లకు ఎంపిక కాబడ్డారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ, మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చావా శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కు వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన హాజీ బ్రదర్స్



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్) : కనిగిరి నియోజకవర్గం పామూరు పంచాయతీ విశ్రాంత పంచాయతీ కార్యదర్శి కీర్తిశేషులు సత్తార్ కుమారుడు షేక్ పెద హాజీ మలన్, శ్రీమతి పర్వీన్ ల కుమార్తె నీహా, తెనాలి వాస్తవ్యులు,జనాబ్ సయ్యద్ జిలాని సాహెబ్, శ్రీమతి హలీమా దంపతుల కుమారుడు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ల వివాహ వేడుకలు శుక్రవారం పామూరు పట్టణంలోని అనిల్ గార్డెన్స్ లో నిర్వహిస్తున్న సందర్భంగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డికి పెద హాజీ మలన్, చిన్న హాజీ మలన్ లు ఆహ్వాన పత్రికతో వివాహానికి హాజరు కావలసినదిగా కోరారు. కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి వివాహానికి ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

## జనసేన పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా గాజు గ్లాస్ గుర్తును కేటాయించడం హర్షణీయం

### జనసేన పార్టీ కదిరి ఇంచార్జ్ భైరవప్రసాద్



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): అతి సామాన్యులను సైతం రాజకీయాల వైపు అడుగులు వేపించాలనే సంకల్పంతో సమాజంలో మార్పు కోసం 2014 లో జనసేన పార్టీ స్థాపించారు మన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు.2019 లో రెండు చోట్లా పోటీ చేసి ఓటమి చెందినా అధైర్య పడకుండా ప్రజల కోసం ప్రజాక్షేమం కోసం సొంత కష్టార్జితాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగిస్తూ కృషి చేసి 2024 %చీణూ% కూటమి లో కీలక పాత్ర వహించి జనసేన పార్టీ తరపున 21 అసెంబ్లీ స్థానాల్లో 2 పార్లమెంట్ స్థానాల్లో పోటీ 100కి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన పార్టీ జనసేన పార్టీ. అటువంటి పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గాజు గ్లాస్ గుర్తును రిజర్వ్ చెయ్యడం ప్రతి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు,వీర మహిళలు హర్షించదగిన విషయం అని భైరవప్రసాద్ గారు తెలియజేశారు.కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీకి గాజుగ్లాస్ గుర్తును శాశ్వత ఎన్నికల గుర్తుగా ప్రకటించడాన్ని స్వాగతించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాయల చలపతి మండల కన్వీనర్లు సాకే రవి కుమార్,. రమణ,ఐటి వింగ్ కోఆర్డినేటర్ పొరకాల రాజేంద్ర ప్రసాద్, పట్టణ కమిటీ సభ్యులు లక్ష్మణ కుటాల, గుంతా ప్రతాప్ , కిన్నెర మహేష్,గంగరాజు ,రాజేంద్ర ప్రసాద్,సోమ శేఖర్ శ్రీనివాసులు,లాయర్ రవి,మహేష్,చెక్క రమణ, రెడ్డి వంశీ , సాయి కుమార్ ,కుమ్మర సోము , కత్తి అరవింద్, గణేష్ నాయక్, దేవలం కార్తిక్, షాబాజ్ తదితర జనసేన పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్, నాలుగు పత్రాలు తప్పనిసరి




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): సింగరాయకొండ మండలంలో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ హజరత్తయ్య మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నాలుగు పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఫిట్నెస్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, మరియు ఆటో ఇన్సూరెన్స్ పత్రాలు డ్రైవర్ల వద్ద ఉండాలని చెప్పారు.ఆటోలతో ప్రయాణించే పేద కూలీల భద్రత కోసం ఈ పత్రాలు ముఖ్యమని హజరత్తయ్య వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఇన్సూరెన్స్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడం సులభమవుతుందని చెప్పారు..ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనఆటో డ్రైవర్లు ఒవర్లోడింగ్ చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఆటో వెనుక తాడులు కట్టడం లేదా ఇతర నిబంధనలు అతిక్రమించడం మానుకోవాలన్నారు. అదేవిధంగా డ్రైవర్లు యూనిఫామ్ ధరించడం తప్పనిసరి అని చెప్పారు.రెగ్యులర్ తనిఖీలతో శాంతి భద్రతలుప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనల పాటనపై మరింత కఠినతరం చేయాలని హెచ్చరించారు. డ్రైవర్లు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని హజరత్తయ్య స్పష్టం చేశారు.ప్రజల భద్రతకు సహకారం అవసరండ్రైవర్లతో పాటు ప్రయాణీకులు కూడా ఈ నియమాలను పాటించాలని, సామూహిక బాధ్యతతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## సింగరాయకొండలో పీడీ పర్యటన మహిళా మార్ట్ ప్రారంభంపై సమీక్ష



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): సింగరాయకొండ మండలాన్ని పీడీ టీ. రవి కుమార్ నిన్న బుధవారం సందర్శించి వివిధ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఏసీ కళ్యాణ్ గారు, సెర్ప్ నుండి కిరణ్ గారు, ఏపీఎం , సీసీ , అకౌంట్ అధికారులు ఆయనతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.పర్యటన సందర్భంగా మహిళా మార్ట్ ప్రారంభానికి సంబంధించి వివిధ చర్యలను పీడీ సమీక్షించి, ముఖ్యమైన మార్గదర్శకాలు అందించారు. అధికారులతో సమావేశం నిర్వహించి, అమలులో ఉన్న కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు.

## కనిగిరి నూతన డిఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసిన గుంటగాని పేతురు




ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత ఎస్సి ఎస్టి బిసి మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుంటగాని పేతురు కొత్తగా నియమితులైన కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగినది.ఈ సందర్భంగా పేతురు పలు సమస్యలను డి.ఎస్.పి దృష్టికి తీసుకురావడం జరిగింది.డిఎస్పి మాట్లాడుతూ మీ సంఘం తరపున వచ్చే అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని పేర్కొన్నారు. అధ్యక్షులు పేతురు డిఎస్పి కి సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర




వ్యవస్థాపక అధ్యక్షులు పేతురు రాష్ట్ర యువత అధ్యక్షులు గుంటగాని రాంప్రసాద్ , సలహా సంఘం సభ్యులు, సుధీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురహరి శ్రీనివాసులు, కనిగిరి టౌన్ అధ్యక్షులు కరాటపు యబేజు. కనిగిరి టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు బత్తుల రత్తయ్య, కనిగిరి టౌన్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ నాగూర్ వలి, యూత్ కమిటీ సభ్యులు చింతగుంట్ల మరియదాసు,మత్త య్య, జ్యోతి బాబు, మరియదాసు, మహేష్, రవి మరియు స్థానిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

# హాలో మాదిగ చలో హైదరాబాద్



**కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాదరావు (శుభోదయం న్యూస్): వెయ్యి గొంతులు లక్ష డబ్బులు మన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 7న జరగబోయే వేయి గొంతులు లక్ష డబ్బులు కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో భాగంగా బుధవారం మాచవరం,చాకిరాల పలు గ్రామాలలో వెలిగండ్ల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గూడూరి శేఖర్ మాదిగ ప్రధాన కార్యదర్శి కుమ్మరి కుంట రాజు మాదిగ వీరి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి రావినూతల కోటయ్య మాదిగ హెచ్ ఎం పాడు మండలం జుటికే రామయ్య మాదిగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దలు విరివిగా పాల్గొన్నారు.**

## మన మంచి ప్రభుత్వ అభ్యర్థి శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుకు మనమందరం సమిష్టిగా కృషి చేయాలి.



(శుభోదయం న్యూస్) : మనమందరం మన మంచి ప్రభుత్వ మద్దత్తు దారులం!సానుభూతి పరులం!!భాగ స్వాములను !!!మన అభ్యర్థి గెలుపు మన మంచి ప్రభుత్వ ఔన్నత్యాన్ని కాపాడుతుంది . పేరు ప్రతిష్టలను పెంచడమే కాకుండా సుస్థిర పరుస్తుంది.కనుక, ప్రభుత్వ పథకాలు, నిర్ణయాలపై భిన్న అభిప్రాయాలు ఉన్నా,మన మంచి ప్రభుత్వ అభ్యర్థి గెలుపు మన సమిష్టి భాద్యత !ఎంఎల్ సి ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు వరుస క్రమంలో ఓట్లు వేసే అవకాశం ఉన్నా,మనం మాత్రం మన మంచి ప్రభుత్వ అభ్యర్థి ఒక్కరికే " 1 " నెంబరు వేసి, మిగిలిన వారెవ్వరికీ ఇతర నెంబర్లు వేయ రాదు.వేసినచో, ప్రాతినిధ్య పద్ధతిలో, చివరినుండి అభ్యర్థులను తొలగించుకుంటూ, వారికి వచ్చిన ఇతరుల ప్రాతినిధ్య ఓట్లను , పంచుతారు .అప్పుడు, మన సమీప పోటీ అభ్యర్థిని ముందుకు తెచ్చిన వాళ్లము అవుతాము.మన అభ్యర్థి గెలుపుకు కావలసిన 50 ం శాతము ఓట్లు మొదటి ప్రాధాన్యత ఓట్ల తోనే గెలిపించుకోవాలంటే, ఎవరూ కూడా మన అభ్యర్థి దగ్గరకు ఓట్లతో పోటీకి రాకుండా ఉండాలంటే,మనము ఇతరులకు ఎవరికీ ఓటు వేయ రాదు.గత ప్రభుత్వ పెద్దల సహాయ సహకారాలతో, ప్రజాస్వామ్య-ప్రగతి శీల శక్తులుగా చెప్పుకొనే వారెవరికైనా, మనం ఓటు చేయరాదు!వేస్తే, మన మంచి ప్రభుత్వ ఔన్నత్యాన్ని ప్రశ్నించిన వాళ్లము అవుతాము !!సమీప అభ్యర్థిని చివరి వరకు పోటీ లో ఉంచిన వాళ్లము అవుతాము!!సరి అయిన విధంగా వ్యవహరిద్దాము !!గత ప్రభుత్వానికి అంటకాగి, ఉద్యోగ-ఉపాధ్యాయ-కార్మిక వర్గానికే కాక సమస్త ప్రజా నీకానికి కంటి మీద కునుకులేకుండా చేసిన వారి ప్రత్యక్ష-పరోక్ష మద్దతుతో పోటీ చేస్తున్న వారి ఎడల సానుభూతి వద్దు కాక వద్దు !సమిష్టిగా నిలబడదాం !మన మంచి ప్రభుత్వ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో, మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించుదాం !! గెలుపులో భాగస్తులమౌదాం !

## నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య




ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిడిపి సీనియర్ నాయకులు, మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పునర్ వైభవం సాధించడంలో లోకేష్ పాత్ర కీలకమైనదని అన్నారు. యువ నాయకత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో జరగడం అభినందనీయమని అన్నారు.

## ఏపీలో బీజేపీ పగ్గాలపై దగ్గుబాటి పురందేశ్వరి స్పందన ఇదే !



ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షపదవిపై జోరుగా ఊహగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీకి అధ్యక్షురాలిగా ఉన్నఆమెకు పోటీగా మరికొందరు సిద్ధంగా ఉండడంతో మరోసారి ఆ పదవిపై ఆమె స్పందించారు. ఏపీలో బీజేపీ పగ్గాలపై దగ్గుబాటి పురందేశ్వరి స్పందన ఇదే !అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షపదవిపై జోరుగా ఊహగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీకి అధ్యక్షురాలిగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరికి పోటీగా మరికొందరు సిద్ధంగా ఉండడంతో మరోసారి ఆ పదవిపై ఆమె స్పందించారు.ఏడాదిన్నర కాలంగా ఏపీలో బీజేపీ అధ్యక్షురాలిగా పనిచేస్తున్న ఆమెకు పోటీగా మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి , విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి , ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధితో పాటు మరికొందరు ఉన్నారు.ఇటీవల జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసినా పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ మరోసారి అధ్యక్ష పదవిపై స్పందించారు. అధిష్టానానికి నాపై నమ్మకం ఉంది. ఏ పదవిచ్చినా నేను తీసుకుంటా. ఇందులో ఎలాంటి అనుమానం లేదని స్పష్టం చేశారు. అధ్యక్ష రేసులో ఎందరైనా ఉండవచ్చు. తప్పులేదు. ఈ విషయంలో కేంద్ర నాయకత్వం టీంను ఏర్పాటు చేసి అధ్యక్షుని పేరును ఖరారు చేస్తుందని అన్నారు.గత మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ మెజారిటీ సాధించడంలో పురందేశ్వరి కీలక పాత్రను పోషించారు. అటు బీజేపీ అధిష్టానాన్ని, ఇటు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లకు గాను ఎన్డీఏ కూటమి 164 సీట్లతో ఘన విజయాన్ని సాధించింది.వైసీపీ కేవలం 11 స్థానాలతోనే సరిపెట్టుకుంది. టీడీపీ మొత్తం 144 స్థానాల్లో పోటీ చేయగా 135 స్థానాల్లో నెగ్గింది. జనసేన 21కి 21 స్థానాలు సొంతం చేసుకుంది . ఇక బీజేపీ మొత్తం 10 చోట్ల పోటీ చేయగా 8 సీట్లలో గెలుపొందింది. ఇక 25 పార్లమెంట్ స్థానాలకు గాను కూటమి 21 స్థానాను కైవసం చేసుకుంది. పురందేశ్వరి రాజమండ్రి పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందింది.

## మధ్య తరగతి కోసం 7 సూత్రాల 'మేనిఫెస్టో'



న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ దేశంలోని మధ్య తరగతి ప్రజల కోసం ఏడు సూత్రాల 'మేనిఫెస్టో'ను బుధవారం ప్రకటించారు. వారిని వరుస ప్రభుత్వాలు అలక్ష్యం చేశాయని, వారు 'పన్ను ఉగ్రవాదం' బాధితులు అని ఆయన ఆరోపించారు. మధ్య తరగతి భారతీయ ఆర్థిక వ్యవస్థకు అసలైన 'సూపర్ పవర్' అని, కానీ వారు సుదీర్ఘ కాలంగా అలక్ష్యానికి గురయ్యారని, వారిని పన్ను వసూలు కోసం దోపిడి చేశారని కేజ్రీవాల్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. మధ్య తరగతివారం ఆందోళనలను పరిహరించడం లక్ష్యంగా ఏడు సూత్రాల ప్రణాళికను కేజ్రీవాల్ ప్రకటించారు. విద్యా బడ్జెట్‌ను ప్రస్తుత రెండు శాతం నుంచి పది శాతానికి పెంచడం, ప్రైవేట్ పాఠశాలల ఫీజులకు గరిష్ఠ పరిమితి విధించడం ఆ డిమాండ్లలో ఉన్నాయి. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేందుకు ఉన్నత విద్య కోసం సబ్సిడీలను, ఉపకార వేతనాలను కూడా ఆయన ప్రతిపాదించారు. ఆరోగ్య సేవల వ్యయం పెంచవలసిన అవసరం ఉందని ఆప్ చీఫ్ స్పష్టం చేస్తూ, ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్నులు తొలగించడంతో పాటు జిడిపిలో పది శాతం పెరుగుదలను సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని కూడా కేజ్రీవాల్ పిలుపు ఇచ్చారు. అవి మధ్య తరగతిపై భారీగా ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన తెలిపారు. నిత్యావసర వస్తువులపై జిఎస్‌టిని తొలగించాలన్నది ఆప్ మరొక డిమాండ్. ఆ జిఎస్‌టి మధ్య తరగతి కుటుంబాలకు నష్టం కలిగిస్తోందని ఆయన అన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వృద్ధులకు ఉచిత ఆరోగ్య సేవలు సహా పటిష్ఠమైన రిటైర్‌మెంట్ ప్లాన్లు మరిన్ని ఉండాలని కూడా ఆయన సూచించారు. ఇటీవలి సంవత్సరాల్లో నిలిపివేసిన వృద్ధులకు రైలు చార్జీల్లో 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని కూడా కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం నాటి నుంచి మధ్య తరగతిని 'బానిస మనస్తత్వం' స్థాయికి కుదించినందుకు రాజకీయ పార్టీలను ఆయన విమర్శించారు. ఆప్ ఎంపిలు రానున్న పార్లమెంట్ సమావేశాల్లో మధ్య తరగతి వారి వాణిని వినిపించగలరని కేజ్రీవాల్ తెలియజేశారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు కొన్ని వారాల ముందు కేజ్రీవాల్ ఈ ప్రకటన చేశారు. ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనుండగా ఫలితాలు 8న వెలువడుతాయి. 2020లో 70 అసెంబ్లీ సీట్లకు 62 కైవసం చేసుకున్న ఆప్ వరుసగా మూడవ విడత అధికారాన్ని ఆశిస్తోంది.

## చింతల్ బస్తీలో ఎమ్మెల్యే దానం నాగేందర్ హల్‌చల్



హైదరాబాద్ : చింతల్ బస్తీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హల్‌చల్ చేశారు. ఎక్కడినుంచో బతకడానికి వచ్చినోళ్లు మాపై దౌర్జన్యం చేస్తారా? అంటూ చిందులు తొక్కారు. బుధవారం షాదన్ కాలేజీ ఎదురుగా ఉన్న నిర్మాణాల్ని అధికారులు కూల్చివేతలు చేపట్టగా, ఈ కూల్చివేతలపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. తన అనుమతి లేకుండా ఎలా కూల్చివేస్తారంటూ అధికారులపై దానం ఫైరయ్యారు. ఎక్కడినుంచో బ్రతకడానికి వచ్చినోళ్లు మాపై దౌర్జన్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దావోస్ నుంచి సీఎం వచ్చే వరకు కూల్చివేతలు ఆపాలని దానం హుకుం జారీ చేశారు. కూల్చివేతలు ఆపకుంటే ఆందోళన చేస్తానంటూ దానం హెచ్చరిక జారీ చేశారు.

## సీఎం రేవంత్ కార్యాలయంపై ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంపై మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం కార్యాలయం నుంచి భూ మార్పిడి జరుగుతుందని ఆరోపించారు. మంగళవారం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై ఈటల రాజేందర్, ఆయన అనుచరులు దాడి చేశారు. ఈ ఘటనలో ఈటలపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల జోలికి వచ్చినా, మహిళలను ఇబ్బంది పెట్టినా చీల్చి చెండాడుతాం. టైగర్ నరేంద్ర, బద్దం బాల్ రెడ్డి, బండారు దత్తాత్రేయ వరకు పేదలకి అండగా నిలిచిన పార్టీ బీజేపీ. రేవంత్ సర్కారు రావడంతోనే హైడ్రా పేరుతో పేదలపై విరుచుకుపడింది. హైడ్రా, మూసి బాధితులకు బీజేపీ అండగా నిలబడింది. రియల్టర్ల పేరుతో దౌర్జన్యానికి దిగుతున్నారని సీపీ దృష్టికి తీసుకెళ్లాం కానీ ఫలితం లేదు. కలెక్టర్, సీపీకి సమస్య వివరించినా పరిష్కారం దొరకలేదు. కబ్జా చేసి పహిల్వాన్‌లను పెట్టి స్థానికులను, మహిళలను బెదిరించారు. ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందో వారి దౌర్జన్యాలు చూస్తే అర్థం అవుతుంది. నేను ఎవరిని కొట్టాలని అనుకోలేదు. కానీ వ్యవస్థ విఫలమైంది. పేదల బాధ చూసి ఆవేశం వచ్చింది. పేదల జోలికి వచ్చినా, మహిళలను ఇబ్బంది పెట్టినా చీల్చి చెండాడుతాం. 2005లో ఏకశిలా నగర్ రాజు, వెంకటేష్, భాస్కర్ అనే ముగ్గురు ప్లాట్లను కొన్నట్టు దొంగ డాక్యుమెంట్లు సృష్టించారు. వాటితో లోన్లుకూడా తీసుకున్నారు. అయితే 2010లో బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన కోర్టు సైతం బాధితులకు అనుకూలంగా తీర్పిచ్చింది. హర్ష కన్‌స్ట్రక్షన్ కంపెనీ వెంకటేష్ ప్లాట్ల ఓనర్లను ఇంకా భయపెడుతున్నారు. ధరణి లోసుగులతో ఇష్టారీతిన ల్యాండ్‌లు మార్చుకున్నారు. అధికారులు కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బాసుల మెప్పు కోసం కాదు పేదలకు న్యాయం చేసేలా అధికారులు పని చేయాలి. అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తే డీవోపీటీకి ఫిర్యాదు చేస్తాం. నాడు, నేడు సీఎంల కార్యాలయాల్లోనే ఈ ల్యాండ్ మార్పిడులు జరుగుతున్నాయి. కాళేశ్వరం కాదు అంతకంటే ఎక్కువ కోట్ల అవినీతి ఈ ల్యాండ్ దందాలలో జరిగింది. కేసులకు భయపడను. తెలంగాణ ఉద్యమంలో 150 కేసులు ఉన్నాయి. ఇప్పుడు 156 అవుతాయి' అని సూచించారు.

## ఇంకెన్నిసార్లు అప్లై చేయాలి.. 'ప్రజాపాలన'పై హరీశ్‌రావు ఫైర్



సిద్దిపేట: పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం(జనవరి22) సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు ఎన్నో షరతులు పెడుతున్నారన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా రైతులకు పూర్తి రుణమాఫీ చెయ్యకుండా ఎగ్గొట్టారని విమర్శించారు. పథకాల కోసం ప్రజాపాలనలో ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సంక్షేమ పథకాలకు ఏడాది కిందట దరఖాస్తు ఇస్తే ఇప్పటికీ దిక్కు లేదు, మళ్ళీ ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలి. దరఖాస్తుల పేరుతో డబ్బులు వృథా అవుతున్నాయి. దరఖాస్తులతోనే ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. అబద్దాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పాలనలో కూడా అబద్దాల పరంపర కొనసాగిస్తోంది. అప్పుడు అందరికీ పరమాన్నం పెడతామన్నారు. ఇప్పుడు అందరికీ పంగ నామాలు పెడుతున్నారు. రుణమాఫీ అయిందని రేవంత్‌రెడ్డి హైదారాబాద్ లో చెప్తున్నాడు దమ్ముంటే ఇక్కడికి రా చూపెడత ఎంతమందికి కాలేదనేది. వడ్డీతో సహ రెండు లక్షల రుణమాఫి చేస్తానని ఇప్పుడు మిత్తీ కట్టించుకుని పాక్షిక రుణమాఫి చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలు, అబద్ధాలు. దమ్ముంటే రేవంత్ రెడ్డి గ్రామ సభలకు రావాలి నేను కూడా వస్తా. పోలీసులను పెట్టి నిర్బంధాల మధ్య గ్రామ సభ నడిపిస్తున్నారు. రేవంత్ రెడ్డి డమ్మీ రుణమాఫీ చెక్ ఇచ్చావు. రెండు నెలలు అయినా రేవంత్ రెడ్డి ఇచ్చిన చెక్ పాస్ కాలేదు. ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు. ఈ ప్రభుత్వానికి మోసాలు తప్ప, నీతి నిజాయితీ లేదు. రుణమాఫీపై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి. ఎప్పటి లోగా చేస్తారో ఎన్ని చేయాలో చెప్పాలి. రాష్ట్రంలో రైతులు పిట్టల్లా రాలిపోతున్నారు. వానాకాలం రైతు బంధు ఎప్పుడు వేస్తారో చెప్పాలి. ఇచ్చిన మాట ప్రకారం 15వేల రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా. ద్రవ్యోల్బణం పెరిగినందున రేషన్ కార్డు ఇన్‌కం లిమిట్ పెంచాలి.

# గాజా.. చెదిరిన స్వప్నం!

### శిథిలాల మధ్య తమ ఇళ్లు వెతుక్కుంటున్న స్థానికులు

### అంతటా రాజ్యమేలుతున్న శ్మశాన వైరాగ్యం

### గాయాల గాజాలో ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు

### వందల లారీల కొద్దీ నిత్యావసరాలు, ఔషధాల తరలింపు



పదిహేను నెలల భీకర యుద్ధం ధాటికి అంధకారమయమైన గాజా స్ట్రిప్ వీధుల్లో ఎట్టకేలకు శాంతిరేఖలు ప్రసరించినా యుద్ధంలో జరిగిన విధ్వంసఛాయలు తొలగిపోలేదు. హమాస్, ఇజ్రాయెల్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంతో ఎట్టకేలకు తుపాకుల మోత, క్షిపణుల దాడులు ఆగిపోయాయి. అయినాసరే అశాంతి నిశ్శబ్దం రాజ్యమేలుతూనే ఉంది. మిస్సైల్స్ దాడుల్లో ధ్వంసమైన తమ ఇళ్లను వెతుక్కుంటూ వస్తున్న పాలస్తీనియన్లకు ఏ వీధిలో చూసినా మృతదేహాలే స్వాగతం పలుకుతూ నాటి మారణహోమాన్ని గుర్తుకు తెస్తున్నాయి. గాజా స్ట్రిప్‌పై వేల టన్నుల పేలుడుపదార్థాలను కుమ్మరించిన ఇజ్రాయెల్ పాలస్తీనియన్ల జనవాసాలను దాదాపు శ్మశానాలుగా మార్చేసింది. స్వస్థలాలకు కాలినడకన, గుర్రపు బళ్లలో చేరుకుంటున్న స్థానికులకు ఎటుచూసినా వర్ణనాతీత వేదనా దృశ్యాలే కనిపిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజల ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాటికింద స్థానికుల జ్ఞాపకాలతో పాటు కలలు కూలిపోయాయి. కొందరు ఆత్మీయులను పోగొట్టుకుంటే.. మరికొందరు సర్వస్వాన్ని కోల్పోయారు. ప్రతి ముఖం మీదా విషాద చారికలే.

#### కుప్పకూలిన వ్యవస్థలు

గాజా స్ట్రిప్ అంతటా ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయింది. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో సగం ఆస్పత్రులు ధ్వంసమయ్యాయి. మిగిలినవి సైతం పాక్షికంగానే పని చేస్తున్నాయి. వాటిల్లోనూ సాధారణ సూదిమందు, బ్యాండేజీ, కాటన్ వంటి వాటినీ అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యారోగ్య సంస్థలను మళ్లీ పునర్నిర్మించాల్సి ఉంది. రోడ్లు, మౌలిక సదుపాయాల పరిస్థితి మరీ అధ్వాన్నం. శిథిలాల తొలగించాక ఏర్పడిన కాలిబాటే ఇప్పుడు అక్కడ రోడ్డుగా ఉపయోగపడుతోంది. సొంతిళ్లు బాంబుదాడిలో ధ్వంసమయ్యాక శరణార్థి శిబిరాల్లో తలదాచుకున్నాసరే పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ వైమానిక బలగాలు వదిలేయలేదు. క్యాంప్‌లపై బాంబుల వర్షం కురిపించడంతో కళ్లముందే కుటుంబసభ్యులను కోల్పోయిన వారు ఇప్పుడు ఎంతో మానసిక వేదనను అనుభవిస్తున్నారు. యుద్ధభయం వారిని ఇంకా వెన్నాడుతోంది. మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారిని పట్టించుకున్న నాథుడే లేడు. యుద్ధం ఆగాక సహాయక, అన్వేషణా బృందాలు అవిశ్రాంతంగా కష్టపడుతూ మరో శ్రామికయుద్ధం చేస్తున్నాయి. శిథిలాల కింద మృతదేహాల నుంచి వెలువడుతున్న దుర్వాసన మధ్యే వాళ్లు శిథిలా తొలగింపు పనులు చేస్తున్నారు. "వీధిని చక్కదిద్దేందుకు ఏ వీధిలోకి వెళ్లినా మృతదేహాలే కనిపిస్తున్నాయి. కూలిపోయిన భవనాల కింద చాలా మంది చిక్కుకుని ఉండొచ్చు"అని గాజా సిటీలోని 24 ఏళ్ల సివిల్ డిఫెన్స్ కార్మికుడు అబ్దుల్లా అల్ మజ్దలావి చెప్పారు. 'నా కుటుంబం శిథిలాల కింద కూరుకుపోయింది, దయచేసి త్వరగా రండి"అంటూ కాల్పుల విరమణ తర్వాత కూడా స్థానికుల నుంచి తమకు నిరంతరాయంగా ఫోన్‌కాల్స్ వస్తున్నాయ ని సహాయక ఏజెన్సీ తెలిపింది.

#### పునర్నిర్మాణానికి చాలా సమయం

ధ్వంసమైన పాలస్తీనా భూభాగంలో పునర్నిర్మాణ ప్రక్రియకు చాలా సమయం పడుతుందని గాజాలోని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థి సంస్థ ఉన్రా తాత్కాలిక డైరెక్టర్ సామ్ రోజ్ తెలిపారు. "గాజాలో ఆవాస వ్యవస్థ దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. మళ్లీ కుటుంబాలు, కమ్యూనిటీలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. సహాయక చర్యలు మరింత పెరుగుతాయని ఆశిస్తున్నాం"అని ఆయన పేర్కొన్నారు. ప్రజల అత్యవసర అవసరాలను తీర్చడానికి, గాజా ప్రజారోగ్య వ్యవస్థను మళ్లీ గాడిన పెట్టేందుకు తొలి 60 రోజుల ప్రణాళిక ఉందని, వేలాది మంది జీవితాన్ని మార్చేసిన గాయాలను మాన్పేందుకు సిద్ధమవుతున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ హనన్ బాల్కీ ప్రకటించారు. ఈ ప్రణాళికలో భాగంగా గాజా స్ట్రిప్‌లో ఆస్పత్రులకు మరమ్మత్తు చేయడం, దాడుల్లో తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో తాత్కాలిక క్లినిక్‌లను ఏర్పాటు చేయడం, ప్రజల్లో పోషకాహార లోపాన్ని పరిష్కరించడం, అంటువ్యాధులు ప్రబలకుండా చూడటం వంటి వాటిపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నామని బాల్కీ వెల్లడించారు.

#### అణువణువునా విధ్వంసం

యుద్ధం దాదాపు 20 లక్షల మంది పాలస్తీనియన్లను నిరాశ్రయులను చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో దాదాపు 46,900 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,10,700 మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. తమ సిబ్బందిలో 48 శాతం మంది ఇక ఈ ఘర్షణల బాధితులున్నారని, కొందరు మరణించగా, మరికొందరు గాయపడ్డారని, ఇంకొందరు నిర్బంధంలో ఉన్నారని గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ తెలిపింది. గాజాలోని 85 శాతం వాహనాలు ధ్వంసమయ్యాయి. తమ 17 కార్యాలయాలు దెబ్బతిన్నాయని గాజా సివిల్ డిఫెన్స్ తెలిపింది. ఆదివారం కాల్పుల విరమణ ప్రారంభం కావడంతో స్థానికుల ముఖాల్లో ఆనందం వచ్చిచేరినా క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తే ఉన్న ఆ కాస్త ఆనందం కూడా ఆవిరయ్యే దుస్థితి దాపురించింది. గాజా అంతటా 60శాతం నిర్మాణాలు పూర్తిగా నేలమట్టమయ్యాయని ఐక్యరాజ్యసమితి గతంలో అంచనా వేసింది. చాలా ఆలస్యంగా కుదిరిన శాంతి ఒప్పందం అమలయ్యే నాటికి మరింతగా దాడులు జరగడంతో నేలమట్టమైన నిర్మాణాల సంఖ్య మరింత పెరిగింది. కూలిన ఇళ్ల కింద 10,000కు పైగా మృతదేహాలు ఉండొచ్చని ఏజెన్సీ అంచనావేస్తోంది.

#### నెమ్మదిగా మొదలైన సాయం

కాల్పులు ఇరువైపులా ఆగిపోవడంతో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఇజ్రాయెల్ దాడుల నుంచి ఎలాగోలా తప్పించుకుని, గాయాలపాలుకాని స్థానికులు సైతం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. శిథిలాల కింద మృతులను అన్నింటినీ తొలగించడానికి కనీసం వంద రోజులు సమయం పడుతుందని అన్వేషణా బృందాలు అంచనావేస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు అవసరమైన బుల్డోజర్లు ఇతర పరికరాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో వెలికితీత మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. దాడుల ధాటికి అన్ని వాణిజ్య సముదాయాలు మూతపడటంతో పని దొరకడం కూడా కష్టంగా ఉంది. స్థానికులకు ఆదాయం కాదు కదా ఆశ్రయం కూడా లేకపోవడంతో గాజాలో బతకడం కూడా పెద్ద అస్తిత్వ పోరాటంగా తయారైంది. కాల్పుల విరమణ జరిగిన వెంటనే ఆహారం, నిత్యావసర వస్తువులు, ఔషధాలను మానవతా సంఘాలు అందించడం మొదలెట్టాయి. ఒక్క ఆదివారం రోజే 630 లారీల నిండా సరకులు గాజాలోకి ప్రవేశించాయి. సోమవారం మరో 915 లారీలు గాజాలోకి వెళ్లాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి చూస్తే ఇంతటి భారీ స్థాయిలో మానవతా సాయం అందడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# స్వచ్ఛ కుంభమేళా

### స్వచ్ఛమైన గాలి కోసం ప్రయాగరాజ్ చుట్టుపక్కల ఏడాదిగా పది ప్రత్యేక వనాల పెంపకం

### ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నియంత్రణ చర్యలు

### లక్షన్నర ప్రత్యేక టాయిలెట్ల ఏర్పాటు..

### 20 వేల మంది సఫాయి కార్మికుల సేవలు వినియోగం

### చెత్త తరలింపునకు 120కి పైగా టిప్పర్ల వినియోగం



(మహా కుంభమేళా ప్రాంతం) సాధారణ రోజుల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ త్రివేణి సంగమం ప్రాంతాన్ని రెండున్నర లక్షల నుంచి మూడు లక్షల మంది పర్యాటకులు మాత్రమే సందర్శిస్తారు. ఇప్పుడు అక్కడ జరుగుతున్న మహా కుంభమేళాకు రోజూ కోటి, రెండు కోట్ల మంది పర్యాటకులు వచ్చి వెళుతున్నా ఆ పరిసరాలు వీలైనంత మేర పరిశుభ్రంగానే కనిపిస్తున్నాయి. ఈ నెల 13న మొదలై 45 రోజులు నిరంతరం కొనసాగే.. భూమిపై జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంగా గుర్తింపు పొందిన మహా కుంభమేళా కార్యక్రమాన్ని పూర్తి పరిశుభ్రత, పర్యావరణ జాగ్రత్తలతో నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం ముందస్తుగా అనేక చర్యలు చేపట్టినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. సాధారణంగా ఎక్కడైనా ఒక లక్ష మంది ప్రజలతో ఒక సభ జరిగితే అది ముగిసిన తర్వాత ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా కనిపిస్తూ ఉంటుంది. అయితే, ఇప్పటికే ఎనిమిది రోజులపాటు రోజూ సరాసరి కోటి మందికి పైగా యాత్రికులు మహా కుంభమేళా త్రివేణి సంగమం ప్రాంతాన్ని సందర్శిస్తున్నా.. అక్కడ పరిసరాలు పరిశుభ్రంగానే కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల పూర్తి నియంత్రణకు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా.. పరిశుభ్రత కోసం 20,000 మంది సఫాయి సిబ్బంది ఆ ప్రాంతంలో షిఫ్టుల వారీగా నిరంతరం పనిచేస్తున్నారు.

#### 10 వేల ఎకరాల విస్తీర్ణంలో లక్షన్నర మరుగుదొడ్లు..

ప్రయాగరాజ్ త్రివేణి సంగమం పరిసర ప్రాంతం చుట్టుపక్కల మొత్తం పది వేల ఎకరాల విస్తీర్ణంలో మహా కుంభమేళా ఉత్సవాలు కొనసాగుతుండగా, యూపీ ప్రభుత్వం ఆ ప్రాంతంలో లక్షన్నర మరుగుదొడ్లు, 5,000 యూరినల్స్ కేంద్రాలు, 350 కమ్యూనిటీ టాయిలెట్లు, 10 టాయిలెట్ కాంప్లెక్స్‌లు ఏర్పాటుచేసింది. మరుగుదొడ్ల శుభ్రతను పర్యవేక్షించడానికి 2,500 మంది సిబ్బందితో పాటు 12 కిలోమీటర్ల పొడవున్న 44 పుష్కర ఘాట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు మరో 5,000 మంది పనిచేస్తున్నారు. త్రివేణి సంగమం నదీ గర్భంలో నీటిని ఎప్పటికప్పుడు శుద్ధిచేసేందుకు 40 కాంపాక్టరు మోటార్లు వినియోగిస్తుండగా, ఆ ప్రాంతంలో పోగయ్యే చెత్తను ఎప్పటికప్పుడు అక్కడ నుంచి తరలించేందుకు 120 టిప్పర్లను వినియోగిస్తున్నారు.

#### పారిశుధ్య కార్మికులకు బీమా

ఇక మహాకుంభమేళా పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్న కార్మికులతో పాటు బోట్‌మెన్‌లకు స్వచ్ఛ కుంభ్ ఫండ్ నిధుల ద్వారా రూ.2 లక్షల జీవిత బీమా పాలసీలు అందజేశారు. అలాగే, ప్లాస్టిక్ వస్తువు వినియోగంపై ముందే శిక్షణ పొందిన దాదాపు 1,500 మంది సిబ్బంది కుంభమేళాకు వచ్చే పర్యాటకులతో ఆ ప్రాంతంలో చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటున్న యజమానులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ, వారిలో అవగాహన కలిగిస్తున్నారు. మహా కుంభమేళా ప్రారంభానికి నెలల ముందే ప్రయాగరాజ్ చుట్టుపక్కల ప్రాంతంలో ఉండే 400 పాఠశాలల్లో ఉపాధ్యాయులు, 4 లక్షల మంది విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కలిగించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

#### స్వచ్ఛమైన తాగునీటి కోసం 1,249 కి.మీ. పైపులైన్లు..

ఇక మహా కుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమంలో పవిత్రస్నానాలు చేసేందుకు రోజూ భారీగా తరలివచ్చే భక్తుల తాగునీటి అవసరాల కోసం ఆ పదివేల ఎకరాల విస్తీర్ణ ప్రాంతంలోనే 1,249 కిలోమీటర్ల పొడవునా మంచినీటి పైపులైన్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. శుద్ధిచేసిన తాగునీటిని ఆ పైపులైన్ ద్వారా యాత్రికులు వినియోగించుకునేలా 56,000 చోట్ల కుళాయిలు ఏర్పాటుచేశారు. 85 గొట్టపు బావులు, 30 జనరేటర్లతో నడిచే పంపింగ్ స్టేషన్‌తో కుంభమేళా ప్రాంతమంతా నిరంతరం నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు సెక్టార్ల వారీగా ఇంజనీర్లు, సిబ్బందిని నియమించారు.

#### ఆకుపచ్చ మహాకుంభ్..

మహా కుంభమేళాలో భాగస్వాములయ్యేందుకు జాతీయ, అంతర్జాతీయంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కోట్లాది మంది భక్తులకు పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభు త్వం రెండేళ్లుగా భారీస్థాయిలో మొక్కల పెంపకం చేపట్టింది. పది ప్రాంతాల్లో చిన్నచిన్న వనాలను రూపొందించింది. మహా కుంభమేళా ప్రారంభానికి ఏడాది ముందు నుంచే ప్రయాగరాజ్ అంతటా సుమారు మూడు లక్షల మొక్కలను పెంచడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మేళా ముగిసిన తర్వాత కూడా వాటి సంరక్షణ, నిర్వహణకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. నగరానికి దారితీసే 18 ప్రధాన రహదారుల వెంట ఈ మొక్కల పెంపకం డ్రైవ్‌లు కొనసాగాయి. కదంబ, వేప, అమల్టాస్ వంటి స్థానిక జాతులకు చెందిన 50,000 మొక్కలు రోడ్లకు ఇరువైపులా ప్రత్యేకంగా నాటారు.

# పక్షులకూ ఓ మ్యూజియం

### పక్షుల జీవ వైవిధ్యం తెలిపే విధంగా ఆకృతులు

### పర్యాటకులను ఆకర్షిస్తున్న 'బర్డ్ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్'



టెక్కలి: ఏటా శీతాకాలం ఆరంభంలో కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో గల సైబీరియా ప్రాంతం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ వలస పక్షులు శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రానికి చేరుకుని సంతానోత్పత్తి చేసుకుంటాయి. తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో గల చింత, రావి, తుమ్మ, గంగ్ర, జూము, వెదురు తదితర చెట్లపై ఆవాసాలు చేసుకుని సమీపంలో చిత్తడి నేలల్లో వేట కొనసాగిస్తాయి. సమీపంలో గల చిత్తడి నేలలో 120 రకాల పక్షులు ఉన్నట్లు అంచనా. దూరం నుంచి పక్షులు చూడడం ఆనందించడం సహజం. పక్షులను దగ్గరగా చూస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఇక్కడ పక్షుల మ్యూజియం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ పక్షుల విన్యాసాలను తిలకించడానికి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. విదేశీ పక్షులైన పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల విన్యాసాలతో పాటు ఈ పక్షుల మ్యూజియం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

#### మ్యూజియంలో నమూనాలు..

విదేశీ పక్షుల ప్రత్యేకతలు ఎంతగానో ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ఆయా ప్రత్యేకతలు మ్యూజియంలో నమూనాలు పరిశీలిస్తే..

పెలికాన్: పెలికాన్ బాతు జాతికి చెందిన పక్షి. దీని బరువు 8 కిలోలు ఉంటుంది. దీని నోరు పొడవు 14 సెంటీమీటర్లు. దీని రెక్కల పొడవు 118 ఇంచీలు, రోజుకు 4 కిలోల చేపల్ని తింటుంది. ఒకేసారి 2 కిలోల బరువు కలిగిన చేపను సునాయాసంగా తినగలిగే సామర్థ్యం ఉంది. దీని గుడ్డు బరువు సుమారు 150 గ్రాములు. ప్రతి సీజన్‌కు 4 గుడ్లను మాత్రమే పెడుతుంది. దీని గుడ్డు 28 రోజుల్లో పిల్లగా పరిపక్వత చెందుతుంది. 3 నెలల్లో పిల్ల తల్లిగా మారుతుంది. దీని దవడ సంచి ఆకారంలో ఉంటుంది. రోజుకు 2 సార్లు ఆహారం కోసం బయటకు వెళ్తుంటాయి. గంటకు 100 కిలో మీటర్ల వేగంతో పయనిస్తాయి. రోజుకు సుమారు 4 సార్లు బయటకు వెళ్తూ ఆహారాన్ని తీసుకువస్తాయి. పెలికాన్ దవడ సంచి ఆకారంలో ఉంటుంది. ఈ దవడలో సుమారు 4 కిలోల వరకు చేపల్ని నిల్వ చేయగలవు. పిల్లలకు ఆహారాన్ని నోటి ద్వారా అందజేస్తాయి. దీని జీవిత కాలం సుమారు 29 ఏళ్లు.

#### పెయింటెడ్ స్టార్క్:

పెయింటెడ్ స్టార్క్ కొంగ జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 5 కిలోలు ఉంటుంది. దీని రెక్కల పొడవు 63 ఇంచీలు, ఇవి చిన్న చేపలు, పురుగులు, నత్తలు తింటాయి. కేవలం పావు కిలో వరకు మాత్రమే నోటిలో ఆహారాన్ని నిల్వ చేయగలుగుతాయి. తీసుకువచ్చిన ఆహారాన్ని గూడు మీద వేస్తే పిల్లలు తింటాయి. దీని నోటి పొడవు సుమారు 16 సెంటీ మీటర్లు. ఆహారం కోసం రోజుకు 2 సార్లు బయటకు వెళ్తుంటాయి. దీనికి సాధారణ దవడ మాత్రమే ఉంటుంది. దీని గుడ్డు సుమారు 75 గ్రాములు. ఇవి ఒక సీజన్‌లో 4 గుడ్లు మాత్రమే పెడతాయి. 28 రోజుల్లో గుడ్డును పిల్లగా పరిపక్వత చేస్తుంది. పిల్ల తల్లిగా మారాలంటే సుమారు 3 ఏళ్ల కాలం పడుతుంది. దీని జీవిత కాలం సుమారు 29 ఏళ్లు.

#### 120 రకాల పక్షుల్లో కొన్ని పక్షుల ప్రత్యేకతలు..

పొడుగు ముక్కు ఉల్లంకి: ఈ పక్షి మట్టిలో ఆహార అన్వేషణకు బురద మట్టి ఇసుక నేలలో అనేక రకాలైన చిన్న పురుగులను కొక్కెం వంటి ముక్కుతో వేట కొనసాగిస్తుంది. ఈ పక్షి నమూనా మ్యూజియంలో ఏర్పాటు చేశారు.

తెడ్డు మూతి కొంగ: ఈ పక్షి మూతి చెంచా ఆకారంలో ఉంటుంది. నీటి అడుగున ఉన్న చిన్న జీవులను వేటాడుతుంది. అర్ధ చంద్రాకారంలో గల మూతితో వేట కొనసాగిస్తుంది.

పాము బాతు : బల్లెం వంటి ముక్కు ఆకారంతో ఈ పక్షి వేట కొనసాగిస్తుంది. మట్టి, నీటిలో పొడుచుకుంటూ ఆహారాన్ని సేకరిస్తుంది.

రాజహంస: జల్లెడ మాదిరిగా ఉన్న ముక్కు కలిగిన ఈ రాజహంస సూక్ష్మ జీవులను సునాయాసంగా వేటాడుతుంది. ఈ పక్షి ముక్కులో ఒక రకమైన వడపోత పరికరం బిగించి ఉన్నట్లు ఉంటుంది.

నత్తగుల్ల కొంగ: నత్తలను వేటాడడంలో ఈ పక్షి ముక్కు ఎంతో షార్ప్‌గా ఉంటుంది. నత్తలను గట్టిగా పట్టుకోవడంతో ఆహారాన్ని సంపాదించుకుంటాయి.

# బిజెపికి షాక్ ఇచ్చిన నితీష్ కుమార్



పాట్నా : బిజెపికి బీహార్ సిఎం నితీష్‌కుమార్ గట్టి షాక్ ఇచ్చారు. మణిపూర్‌లో బిజెపి నేతృత్వంలోని బీరెన్‌సింగ్ ప్రభుత్వానికి నితీష్ తమ మద్దతు ఉపసంహరించుకున్నారు. 2022 జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మణిపూర్‌లో జెడియు ఆరు స్థానాల్ని గెలుచుకుంది. అయితే కొన్ని నెలలకే ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఐదుగురు బిజెపిలో చేరారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో జెడియుకి ఒకేఒక్క ఎమ్మెల్యే మాత్రమే మిగిలారు. తాజాగా బీరెన్ సింగ్ ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు నితీష్ కుమార్ వెల్లడించారు. అయితే మద్దతు ఎందుకు ఉపసంహరించుకున్నారనే విషయంపై స్పష్టత లేదు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జెడియు.. మణిపూర్‌లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వంతో ఉపసంహరించుకోవడం పట్ల రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## మహారాష్ట్రలో రైలు ప్రమాదం.. ఆరుగురు మృతి



జలగావ్ : మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జలగావ్ జిల్లాలో కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టడంతో పలువురు మృతి చెందారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో మంటలు చెలరేగాయన్న వదంతులతో ప్రయాణికులు చైన్ లాగి కిందికి దిగారు. పట్టాలు దాటుతున్న ఆ ప్రయాణికులను మరో ట్రాక్‌పై వస్తున్న కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాల్పుల్లో హిజ్బుల్లా కమాండర్ షేక్ హమ్మాదీ మృతి



లెబనాన్ : దుండగులు జరిపిన కాల్పుల్లో సీనియర్ హెజ్బుల్లా కమాండర్ షేక్ హమ్మాదీ మృతి చెందారు. మంగళవారం రాత్రి రెండు వాహనాల్లో వచ్చిన దుండగులు తూర్పు లెబనాన్‌లో తన నివాసంలో ఉన్న హమ్మాదీపై కాల్పులు జరపారు. దీంతో అతను తన ఇంటి ముందే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని లెబనీస్ వార్తాపత్రిక అల్ అఖ్బర్ నివేదించింది. దాడి జరిగిన వెంటనే హమ్మాదీని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయాలపాలై వెంటనే మృతి చెందినట్లు అల్ అఖ్బర్ పత్రిక నివేదించింది. అయితే అతను చనిపోవడానికి కుటుంబ కలహాలే కారణమని ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ వీటిపై సరైన స్పష్టత లేదు. ఇప్పటివరకు ఏ గ్రూపు కూడా ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు వెల్లడించలేదు. కాగా, షేక్ హమ్మాదీ హిజ్బుల్లా యొక్క పశ్చిమ అల్ బకా ప్రాంతానికి కమాండర్‌గా పనిచేశాడు. హమ్మాదీ 1985లో లుఫ్తాన్స ఫ్లైట్ 847 వెస్ట్ జర్మన్ విమానాన్ని హైజాక్ చేశాడు. అప్పుడు ఈ విమానంలో 153 మంది ప్రయాణీకులు ఉన్నారు. వీరిలో పలువురు అమెరికన్లు ఉన్నారు. హైజాక్ అయిన సమయంలో ఓ అమెరికన్ జాతీయుడిని చిత్రహింసలకు గురిచేసి చంపారు. దీంతో వాంటెడ్ నేరస్తుల జాబితాలో హమ్మాదీ చేరారు.

## తెలంగాణలో భారీ పెట్టుబడికి ముందుకొచ్చిన మరో కంపెనీ 'కంట్రోల్ ఎస్'




దావోస్ : తెలంగాణ రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టడానికి మరో కంపెనీ ముందుకు వచ్చింది. రూ. 10 వేల కోట్లతో పెట్టుబడితో కంట్రోల్ ఎస్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నది. హైదరాబాద్‌లో 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. డేటా సెంటర్ క్లస్టర్‌లో 3,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మంత్రి శ్రీధర్‌బాబు, కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ సమక్షంలో ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ రాష్ట్రంలో మరో మైలురాయి అన్నారు. హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ విజయ్ కుమార్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ చర్చలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. హైటెక్ సిటీలో హెచ్‌సీఎల్ 3.2 లక్షల చదరపు అడుగుల్లో క్యాంపస్ నిర్మిస్తున్నది. కొత్త క్యాంపస్‌తో 5 వేల మంది ఐటీ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఫిబ్రవరిలో దీన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రిని హెచ్‌సీఎల్ ఎండీ కోరారు. తెలంగాణలో ఆ సంస్థ సేవల విస్తరణను సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు.

## ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు

### కూటమి సర్కార్‌పై కాకాణి ఫైర్




నెల్లూరు: కూటమి సర్కార్ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే తనపై అక్రమ కేసులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ క్యాడర్‌పై కూటమి దాడులు చేస్తున్నారని.. పరామర్శకు వెళ్లిన తనపై అక్రమ కేసు పెట్టడం దారుణమన్నారు. అక్రమ కేసులు, అరెస్టులతో మా గొంతును నొక్కలేరు. టీడీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారులపై చర్యలు తప్పవు. అవసరమైతే కోర్టుకు కూడా వెళ్తాం. నా పై మరిన్ని కేసులు పెట్టడానికి సీఐడీ అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. కేసులు, అరెస్టులతో వైఎస్ జగన్ హార్డ్ కోర్ అభిమానులను ఆపలేరు. ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటా.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేదాకా పోరాడుతా" అని కాకాణి చెప్పారు.

# భవిష్యత్తు బంగారమేనా?



అనుకున్నదే అయింది. అమెరికా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తూనే డొనాల్డ్ ట్రంప్ తన మాటలు, చేతలు, చేష్టల ద్వారా సంచలనాలు సృష్టించారు. గతంలో దేశానికి 45వ అధ్యక్షుడిగా పనిచేసి, తాజాగా 47వ అధ్యక్షుడిగా సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్ తన తొలి ప్రసంగంలోనే 'ఇక నుంచి అమెరికాకు స్వర్ణయుగం' అంటూ అమెరికన్లలో ఆశలు, ఆకాంక్షలు పెంచారు. అయితే, 'అమెరికాను మళ్ళీ ఘనమైన దేశంగా తీర్చిదిద్దాల'ని (మాగా) నినదిస్తూ ఆయన ప్రకటించిన కొన్ని చర్యలు ఆధిపత్య, విస్తరణవాదానికి ప్రతీకగానూ ప్రతిధ్వనించాయి. వర్తమాన ప్రపంచ అధికార క్రమాన్ని మార్చివేసే పలు చర్యలకు నడుం బిగిస్తున్న తీరు, అలాగే కోవిడ్, చైనాలను సాకుగా చూపుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి, అలాగే పర్యావరణ రక్షణపై ప్యారిస్ ఒప్పందం నుంచి పక్కకు తప్పుకుంటున్నట్లు ప్రకటించడం ప్రపంచాన్ని నివ్వెరపరుస్తోంది. ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారం పైకి సాదాసీదా అధికార మార్పిడిగా అనిపించవచ్చు. రాజకీయ ప్రత్యర్థులు సైతం చిరునవ్వులు చిందిస్తూ సౌహార్దం చూపుకుంటున్నట్టు కనిపించవచ్చు. అంతమాత్రాన అంతా మామూలే అనుకొంటే పొరపాటు. పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో దర్శనమిచ్చిన ఐక్యతకు భిన్నంగా ప్రత్యర్థులపై తుపాకులు ఎక్కుపెట్టిన తీరు ఆయన ప్రసంగంలో స్పష్టంగా వినిపించింది. కునారిల్లిన దేశాన్ని తాను మాత్రమే మళ్ళీ పునరుత్తేజితం చేయగలనన్న భావన కలిగించడంతో పాటు ఆయన ఒకటికి రెండు జాతీయ ఎమర్జెన్సీలు ప్రకటించడం పెను పర్యవసానమే. అలాగే, చైనా నుంచి పనామా కాలువను వెనక్కి తీసుకోవాలని పిలుపునివ్వడమూ వివాదాస్పదమే. బలప్రయోగం ద్వారా మాత్రమే సాధ్యమయ్యే అలాంటి పనుల ప్రస్తావన నిప్పుతో చెలగాటానికి సిద్ధమని స్పష్టం చేయడమే. ఇక, గద్దెనెక్కిన తొలిరోజునే 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'ను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా ట్రంప్ ప్రకటించడంతో రానున్న రోజుల్లో అంతర్జాతీయంగా మరెన్ని ఆశ్చర్యకర పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఉద్విగ్నత నెలకొంది. పదవి చేపడుతూనే ట్రంప్ చకచకా సంతకాలు చేసిన పదుల సంఖ్యలోని కార్యనిర్వాహక ఆదేశాలు ఆసక్తికరం. పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేయడం, జన్మహక్కుగా సంక్రమించే పౌర సత్వంపై అమెరికా రాజ్యాంగాన్ని సైతం తోసిపుచ్చడం లాంటివి ఇట్టే మింగుడుపడే అంశాలు కావు. జాతీయతతో సంబంధం లేకుండా దేశంలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నవారికి పుట్టినబిడ్డలకు సైతం 150 ఏళ్ళ పైచిలుకుగా అమెరికా పౌరసత్వం దక్కుతూ వచ్చింది. కానీ, నెల రోజుల్లో అమలులోకి రానున్న తాజా ఆదేశం ఫలితంగా ఇప్పుడిక అలాంటి పిల్లలకు పౌరసత్వ పత్రాలివ్వరు. అదేమంటే, 1868లో చేసిన 14వ సవరణ కింద అమెరికా గడ్డపై పుడితేచాలు ఆ పిల్లలకు మారుమాట లేకుండా పౌరసత్వమివ్వాలనేమీ లేదనీ, సవరణను తప్పుగా వ్యాఖ్యానించారనీ ట్రంప్ వాదన. తాత్కాలిక వీసాలతో అమెరికాలో నివసిస్తూ, ఉద్యోగాధారిత గ్రీన్‌కార్డ్‌కై దీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్న 10 లక్షల పైచిలుకు మంది భారతీయులకు ఈ కొత్త నిర్ణయం అశనిపాతమే. ఇప్పటికే కొన్నిచోట్ల ఇమ్మిగ్రేషన్ లాయర్లు కోర్టుకెక్కిన ఈ ఆదేశం గనక అమలైతే, తాత్కాలిక వర్క్ వీసాలు, టూరిస్ట్ వీసాలపై అగ్రరాజ్యంలో ఉంటున్నవారి సంతానానికి అక్కడి పౌరసత్వ ఆశలు అడుగంటినట్లే. 2022 నాటి అమెరికా జనాభా లెక్కలపై ప్యూ రిసెర్చ్ విశ్లేషణ ప్రకారం అమెరికాలో 48 లక్షల మంది భారతీయ అమెరికన్లుంటే, వారిలో మూడింట రెండొంతుల మంది వలసజీవులే. కేవలం 34 శాతం, మరో మాటలో 16 లక్షల మంది మాత్రం అగ్రరాజ్యంలోనే పుట్టారు. ఇక, చట్టవిరుద్ధమైన వలసల్ని అడ్డుకుంటాననీ, సరైన పత్రాలు లేని లక్షలాది వలస జీవుల్ని దేశం నుంచి పంపివేస్తాననీ ట్రంప్ చేసిన గర్జన కూడా లక్షలమందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆ జాబితాలో మెక్సికో (40 లక్షలు), ఎల్ సాల్వడార్ (7.5 లక్షలు) తర్వాత 7.25 లక్షల మంది భారతీయులదే మూడో స్థానం. ఫలితంగా, ట్రంప్ ప్రతి మాట, ప్రతి అడుగు మనవాళ్ళలో ఆదుర్దా పెంచుతోంది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ కొత్త ఏలుబడిలో భారత్‌తో బంధం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. మరోపక్క డెమోక్రాట్లను జనం బాధలు పట్టని కులీనులుగా చిత్రించి, సామాన్య పౌరుల సంరక్ష కుడిగా ఎన్నికల్లో తనను తాను చూపుకొన్న ట్రంప్‌ను అతిగా నమ్మి మోసపోయామనే భావన రేకెత్తడం సహజమే. చేతిలోని నియంత్రణ నిర్ణయాలే అండగా ఇటీవలే ఓ బ్రాండెడ్ క్రిప్టో టోకెన్ ద్వారా ఆయన వందల కోట్ల డాలర్ల లబ్ధి పొందాడనే విమర్శలూ గుప్పుమంటున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన 80 ఏళ్ళ తర్వాత కీలక సమయంలో పగ్గాలు చేపట్టిన ట్రంప్ తన మద్దతుదారులకై ఏమైనా చేసేలా ఉన్నారు. 2021లో అమెరికా అధ్యక్ష భవనంపై దాడి చేసిన దాదాపు 1500 మంది దుండగులకూ ఆయన తక్షణం సామూహిక క్షమాభిక్ష ప్రసాదించడమే అందుకు తార్కాణం. నాలుగేళ్ళు విచారించి, శిక్షలు వేసిన న్యాయవ్యవస్థను అలా నూతన అధ్యక్షుడు పరిహసించినట్టయింది. ఆశ్రితులు, ఆర్థిక దాతలు, బంధు మిత్రులకై క్షమాభిక్ష వ్యవస్థను దుర్వినియోగం చేయడంలో నిన్నటి బైడెన్ నుంచి నేటి ట్రంప్ దాకా అందరూ ఒకే తాను గుడ్డలన్న మాట. కాలు మోపిననాడే కాపురం చేసే లక్షణం తెలిసిందన్నట్టు ట్రంప్ 2.0 హయాం ఆరంభమవు తూనే రోజులు ఎలా ఉండనున్నాయో తేటతెల్లమైంది. బహుళ ధ్రువ ప్రపంచం వైపు అంతర్జాతీయ అధికార క్రమం అడుగులేస్తున్న కాలంలో 'అమెరికా ఫస్ట్' నినాదంతో సామాజిక, ఆర్థిక రంగాల్లో ట్రంప్ ఆధిపత్యభావ నిర్ణయాలు రానున్న నాలుగేళ్ళలో ప్రపంచాన్ని కుదిపేయడం ఖాయం.

# కార్పొరేట్ ఒత్తిళ్లలో విద్యార్థులు

భావిభారత పౌరులైన విద్యార్థులు కళాశాలలు పెట్టే ఒత్తిళ్లకు బలవుతున్నారు. వారానికి ఏడు రోజుల పాటు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు చదువుల పేర విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలలో బంధీలవుతున్నారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు ర్యాంకుల మాయలో పడి, దాని వలన జరిగే నష్టాన్ని గ్రహించలేకపోతున్నారు.

### నిబంధనలు ఇలా చెప్తున్నాయి

రాష్ట్రంలో దాదాపుగా 13,249 ప్రైవేట్ స్కూళ్లు, 3568 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో అధిక భాగం కార్పొరేట్ విద్యా సంస్థలే. ఇక్కడ లక్షలాది మంది చదువుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైమరీ పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, యు.పి, ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలి. వీటిలో కూడా వారానికి మూడు రోజులు గంటపాటు ఆటలు ఆడించాలి. ఇక కళాశాలల విషయానికొస్తే ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నిర్వహించాలి. మన రాష్ట్రంలో 90 శాతం విద్యా సంస్థలు నిబంధనలు పాటించిన పాపాన పోలేదు. ఎన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం ఈ ఒత్తిడి తట్టుకోలేక 2014 నుంచి 2022 వరకు 3690 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒక్క 2022 సంవత్సరంలోనే 575 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. దీన్నిబట్టే విద్యార్థులు ఎంత ఒత్తిడికి లోనవుతున్నారనేది మనం అర్థం చేసుకోవచ్చు.

### ప్రభుత్వం ఏం చేస్తున్నది?

ఈ వారంలోనే ఇంటర్మీడియట్ బోర్డు ఒక ప్రకటన విడుదల చేసింది. అదేమిటంటే ఒత్తిడి తగ్గించడం కోసం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు చేస్తున్నామని తెలిపింది. పరీక్షల రద్దు వలన ఒత్తిడి తగ్గుతుందనుకోవడం హాస్యాస్పదం. అసలు కార్పొరేట్ విద్యా సంస్థల అధిపతి అయిన మంత్రి పి.నారాయణను విద్యా కమిటీలో పెట్టడం ద్వారా ప్రభుత్వం ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందో అర్థం కావడం లేదు. ఈ మధ్యనే పాఠశాలలో



వంద రోజుల కార్యక్రమం పెట్టింది. వంద రోజులు పాటు విశ్రాంతి లేకుండా చదువుల పేరుతో విద్యార్థులను వేధిస్తే వారు ఏమైపోతారోననే ఆలోచన కూడా లేకుండా పోయింది.

### తల్లిదండ్రులారా ఆలోచించండి

తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరుస్తున్న తల్లిదండ్రులు ఒక విషయం ఆలోచించాలి. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కాదు కదా అసలు వారికి భవిష్యత్తు లేకుండా పోతుంది ఈ విధానాల వల్ల. అనేక మంది విద్యార్థులు ర్యాంకుల వేటలో సాగలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇంకొంతమంది విద్యార్థులు ఒత్తిడిని లోలోపల దాచుకుంటూ ఆరోగ్య సమస్యలను కొనితెచ్చు కుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిబంధనలకు అనుగుణంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. ఇదే సందర్భంలో తల్లిదండ్రులు విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని గ్రహించాలి. ఆ ఒత్తిడిని అధిగమించేలా ప్రణాళికలు రూపొందించాలి.

# ఉద్యమంతో దిగివచ్చిన కేంద్రం



దాదాపు గత ఏడాదిగా రైతులు తమ డిమాండ్ల సాధనకు సాగిస్తున్న ఉద్యమానికి ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పలేదు. గత ఏడాది ఫిబ్రవరి 13 నుంచి ఎస్‌కెఎం, కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ల కింద రైతులు పంజాబ్ హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద నిరసనలు సాగిస్తున్నారు. అయితే సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కన్వీనర్‌గా ఉన్న జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ (70) గత నవంబర్ 20 నుంచి ఎలాంటి కనీస వైద్యసాయం అందకుండా నిరాహార దీక్ష కొనసాగించడం కేంద్ర వెన్నులో చలిపుట్టించింది. అంతే రైతులు గత ఏడాది కాలంగా సాగిస్తున్న ఉద్యమానికి ఇప్పుడు కేంద్రం నుంచి కదలికి రావడం చూస్తుంటే ఇన్ని నెలలుగా రైతులంటే కేంద్ర దృష్టిలో ఎంత చులకనగా ఉన్నారో తెలుస్తుంది. క్షీణిస్తున్న ఆయన ఆరోగ్యంపై అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. గత డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో మూడు తేదీల్లో తీసుకున్న దల్లేవాల్ రక్తనమూనాల ఆధారంగా దర్యాప్తు చేపట్టింది. దల్లేవాల్ నిరాహార దీక్షలో కొనసాగుతున్నా ఆయన ఆరోగ్య పారామితులు ఎలా మెరుగుపడుతున్నాయని కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మెడికల్ బోర్డు నుండి అభిప్రాయం కోసం అతని ఆరోగ్య నివేదికల కాపీని పరిశీలించాలని పంజాబ్ ప్రభుత్వాన్ని కోరింది. దల్లేవాల్‌ను తాత్కాలిక ఆస్పత్రికి మార్చేలా ఆదేశాలు జారీ చేసింది. జనవరి 2 లోగా ఆయనకు ఎలాగైనా వైద్య సాయం అందించాలని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటమ్ ఇచ్చినా ఫలించలేదు. దల్లేవాల్ నిరాహార దీక్ష ఎక్కడా ఆగలేదు. దీంతో ఫిబ్రవరి 14న చండీగఢ్ వేదికగా చర్చలకు రావాలంటూ కేంద్రం ఆహ్వానించడం చెప్పుకోదగ్గ పరిణామం. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి ప్రియరంజన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు దల్లేవాల్‌ను, సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులను కలుసుకుని చర్చలు జరుపుతారు. ఈ నేపథ్యంలో గత 55 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష సాగిస్తున్న తమ సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ (70)ను కనీస వైద్యం పొందేందుకు రైతులంతా కలిసి బలవంతంగా ఒప్పించారు. దల్లేవాల్‌కు సంఘీభావంగా నిరాహార దీక్షలు సాగిస్తున్న 121 మంది రైతులు కూడా తమ దీక్షలను విరమించారు.

అయితే దల్లేవాల్ కూడా దీక్ష విరమించినట్టే అని అనుకోరాదు. తాము కోరుతున్న డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుందని రైతు నేతలు స్పష్టం చేయడం ఈ సందర్భం గా గమనార్హం. అలాగే జనవరి 26న నిర్వహించ తలపెట్టిన ట్రాక్టర్ మార్చ్ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రం చర్చలకు పంపిన ఆహ్వానంపై రైతులు ఒక విజయంగా భావించడం లేదు. కానీ మూసుకున్న కేంద్ర ప్రభుత్వ తలుపులను తెరిపించగలిగాం అని పంజాబ్ రైతులు వ్యాఖ్యానించారు. ఇంతవరకు అన్నదాతల ఆందోళనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. పైగా ఉద్యమాలను ఉక్కుపాదంతో తొక్కివేయడానికి కేంద్రం ఎంతగా ప్రయత్నించిందో, ఉద్యమకారులను దేశద్రోహులుగా నేరస్తులను చేసి జైళ్లలో ఎలా మగ్గబెట్టిందో అందరికీ తెలిసిందే. లాఠీఛార్జీ, బాష్పవాయు ప్రయోగం, బారికేడ్లతో అడ్డంకులు, అరెస్టులు, అక్రమ కేసులు బనాయింపులు జరిగాయి. దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్షను నీరుకార్చడానికి కేంద్రం ప్రయత్నించింది. రైతులను బుజ్జగించడానికి ఇటీవల డై అమోనియం ఫాస్ఫేట్ ఎరువుపై అదనపు రాయితీ కింద రూ. 3850 కోట్ల వరకు వన్‌టైమ్ ప్యాకేజీగా ఇవ్వడానికి నిర్ణయించినట్టు గొప్పగా చెప్పుకొంది. అయినా రైతులకు ఉపశమనం కలగలేదు. వ్యవసాయానికి ఎరువులు ఎంత అవసరమో, పంటలు పండిన తరువాత వాటికి గిట్టుబాటు ధర కల్పించడం కూడా అంతే అవసరం. పంటలు అమ్ముడుపోనప్పుడు ఎన్ని ఎరువులు వేసి, ఎన్ని రుణాలు ప్రభుత్వం అందించినా రైతుకు మేలు చేయదు సరికదా నిరాశా నిస్పృహలకు దారి తీస్తుంది. పంట అన్నది రైతుల కష్టఫలం. ఇందులో అన్యాయం జరిగితే రైతు బతుకు నిలవదు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకు దల్లేవాల్ నిరసన దీక్ష కొనసాగుతుందని సుప్రీం కోర్టుకు కూడా రైతు నాయకులు చెప్పారు. ఒకవంక రైతులను చర్చలకు కేంద్రం ఆహ్వానించినా కేంద్రంపై రైతునాయకులకు పూర్తి విశ్వాసం కలగడం లేదు. ఎందుకంటే మరోవంక మళ్లీ దొడ్డిదారిన ఆ మూడు చట్టాలను తిరిగి అమలు చేయడానికి ప్రయత్నాలు సాగిస్తోందని తెలుస్తోంది. ఈ చట్టాలపై కొత్తగా అభిప్రాయాల సేకరణకు అన్ని రాష్ట్రాలకు కొత్త పాలసీ కాపీలు పంపారని ఆమ్‌ఆద్మీ చీఫ్, మాజీ ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీని కేంద్రం ఇటీవల ప్రకటించింది. ఈ పాలసీ ప్రకారం మూడు వ్యవసాయ చట్టాలను ఎలాగోలా అమలు చేయాలన్నదే కేంద్ర యంత్రాంగం తంత్రం. ఇదిలా ఉండగా రైతులు తమ డిమాండ్ల సాధనే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఫిబ్రవరి 14న ప్రభుత్వంతో చర్చలు జరిపేటప్పుడు రైతులకు రుణమాఫీ చేయాలని, స్వామినాథన్ కమిటీ సూచించిన సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ప్రధానంగా చర్చకు రానున్నాయి. ఇంతేకాకుండా కేంద్రం ప్రభుత్వం గతంలో రైతులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాయి.